ప్రజా

# రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

**పాత్రికేయులు కావలెను**

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్ ప్రతి అక్షరం ప్రజల కోసం

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -41 పేజీలు - 8 వెల - 03/- బుధవారం 27 మే 2026

# 'ఫార్మ్ టు హోమ్'

## రైతుల ముంగిటకే మార్కెట్..

**రైతు ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేర్చే 'ఫార్మ్ టు హోమ్' విధానం**

**యడవోలు వద్ద కోకో సిటీ ఏర్పాటుకు పరిశీలన**

**జూలైలో అగ్రికల్చర్ స్కూల్‌కు శంకుస్థాపన**

**రైతు బజార్లలో ప్రకృతి సేద్య ఉత్పత్తులకు ప్రత్యేక కౌంటర్లు**



**ఆక్వా రైతులకు భారీ ఊరట**

**వ్యవసాయం, అనుబంధ రంగాలపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**కొత్త ఆక్వా కనెక్షన్లకూ విద్యుత్ సబ్సిడీ**

**అధికారులకు కీలక ఆదేశాలు**

**అమరావతిమే 26(రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్ర వ్యవసాయ రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైతులు పండించిన పంటలను, ముఖ్యంగా కూరగాయలు, పండ్లను నేరుగా వినియోగదారుల ఇళ్లకే చేర్చేందుకు 'ఫార్మ్ టు హోమ్' విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఫీూాం) ద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులు అందుతాయని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ దిశానిర్దేశం చేశారు. **మిగతా 2లో...**

# శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

## ఇరాన్‌తో చర్చలపై తాజాగా ట్రంప్ వెల్లడి



**వాషింగ్టన్,మే 26(రిపబ్లిక్ న్యూస్):**
అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం కీలకాంశంగా మారింది. శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవాలని అమెరికా కోరుతుండగా, అందుకు ఇరాన్ పూర్తిగా అంగీకరించడం లేదు. తాజాగా ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద ఉన్న అధికంగా శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు అప్పగించాలని, లేదంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో పూర్తిగా ధ్వంసం చేయాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశముందని ట్రంప్ హెచ్చరించారు. అధిక శుద్ధి చేసిన యురేనియం ద్వారా **మిగతా 2లో...**




## నేటినుంచి టిడిపి మహానాడు

**వర్చువల్ విధానంలో రెండ్రోజుల పండగ**

**పార్టీ నేతలతో చర్చించిన అధినేత చంద్రబాబు**

**అమరావతిమే 26(రిపబ్లిక్ న్యూస్):**
టీడీపీ మహానాడు 2026 రెండ్రోజుల పాటు జరుగనుంది. బుధ,గురువారాల్లో
ఈసారి పూర్తిగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. దీనిని వివిధ మాధ్యమాల ద్వారా ప్రసారం చేస్తారు. ఈ విషయాన్ని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు, గ్రామ స్థాయి కార్యకర్తలతో**మిగతా 2లో...**

# పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

**ఆన్లైన్ పన్నుల వసూళ్లతో విధానంతో పారదర్శకత పెరుగుతుంది**

**ఆన్లైన్ పన్నుల విధానాన్ని పరిశీలించిన ఉప ముఖ్యమంత్రిపవన్ కళ్యాణ్**

**రాజమండ్రి మే 26(రిపబ్లిక్ న్యూస్):**
'సాంకేతికత వినియోగంతో పారదర్శకత పెరుగుతుంది. పంచాయతీ పన్నుల వసూలు ప్రక్రియ సరికొత్త మార్గంలో ముందుకు వెళ్లడం శుభపరిణామం' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ అన్నారు. గతంలో మాన్యువల్ పద్ధతిలో పన్ను వసూళ్లు ఉండేవని, దీన్ని పూర్తిగా మార్చి మొత్తం ఆన్లైన్ విధానం తీసుకు వచ్చామని చెప్పారు. పంచాయతీల్లో పన్నుల వసూళ్లకు నూతనంగా ప్రవేశపెట్టిన ఆన్లైన్ విధానాన్ని ఉప ముఖ్యమంత్రివర్యులు మంగళవారం స్వయంగా పరిశీలించారు. **మిగతా 2లో...**



# ఈడీ విచారణకు

## చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి భార్య, కుమారుడు

**లిక్కర్ స్కామ్ లో విచారణ వేగవంతం చేసిన ఈడీ**

**ఈడీ అధికారులకు తమ ఆస్తుల వివరాలను అందించామన్న మోహిత్ రెడ్డి**

**తమ కుటుంబం సంపాదించిన ప్రతి రూపాయి కష్టార్జితమేనని వ్యాఖ్య**



# శివరాజ్ సింగ్ చౌహాన్ మోదీపై పుస్తకం..

**ప్రధాని మోదీతో తన అనుభవాలపై 'అప్నాపన్' పేరుతో రచన**

**ఢిల్లీలో జరిగిన ఈ వేడుకకు హాజరైన ఏపీ మంత్రి నారా లోకేష్**

**మాజీ ప్రధాని దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఆవిష్కరణ**

**కార్యక్రమంలో పలువురు జాతీయ నేతలను కలిసిన లోకేశ్**



# పంచాయతీ సిబ్బందికి రేవంత్ సర్కారు తీపి కబురు

**రాష్ట్రంలోని 50 వేల మంది పంచాయతీ సిబ్బందికి ఒకటో తారీఖునే జీతాలు**

**జీతాల కోసం ప్రతినెలా రూ. 50 కోట్ల ప్రత్యేక నిధుల విడుదల**

**గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పిస్తూ కీలక నిర్ణయం**

**పోస్టల్ విధానం రద్దు.. ఇకపై పెన్షన్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ**



**హైదరాబాద్ మే 26(రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది. సుమారు 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు సమయానికి జీతాలు అందినట్లే, క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ సిబ్బందికీ వేతనాలు అందాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు.గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల చెల్లింపులో జాప్యం జరగకుండా,**మిగతా 2లో...**

# పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

**అనుమతిచ్చిన కోర్టు**

**నేడు చర్లపల్లి జైలునుంచి సిట్ కార్యాలయానికి తరలింపు విచారించనున్న బృందం**



# 'ఫార్మ్ టు హోమ్'

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఈ ఏడాది రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, ప్రాంతాల వారీగా పంటల ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ప్రతికూల వాతావరణంలోనూ రైతులు నష్టపోకుండా కనీస మద్దతు ధర కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకోవాలన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలని, ఈ విధానంలో విజయం సాధించిన రైతుల అనుభవాలను వినియోగించుకోవాలని తెలిపారు. భూసార పరీక్షలు నిర్వహించి, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో రైతులకు అందుబాటులో ఉంచాలని, రైతు బజార్లలో ప్రకృతి సేద్య ఉత్పత్తులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నీటి కొరత ఉన్నచోట్ల పీఎండీఎస్-హాఫ్ మూన్ పద్ధతుల్లో సేద్యం చేపట్టాలన్నారు.

**ప్రాంతీయ అభివృద్ధికి భారీ ప్రణాళికలు**

రాయలసీమను ఉద్యానవన హబ్‌గా మార్చేందుకు రూ.40 వేల కోట్లతో 'పూర్వోదయ' పథకం కింద సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, గోదాముల వంటి మౌలిక వసతులు కల్పించనున్నట్టు సీఎం వివరించారు. దీనికి తోడు రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యడవోలు వద్ద 'కోకో సిటీ' ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

అలాగే, జూలై నాటికి మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేయనున్నట్టు వెల్లడించారు. పులివెందులలో సెంట్రల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ నిర్మాణాన్ని పూర్తి చేసి, వినియోగంలోకి తెచ్చేందుకు తక్షణమే రూ.3 కోట్లు విడుదల చేయాలని ఆదేశించారు. రాయలసీమలో పండే అరటికి ప్రత్యేకంగా కోల్డ్ స్టోరేజ్ సౌకర్యం కల్పించాలని కూడా అధికారులను ఆదేశించారు. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు క్లస్టర్ల వారీగా ప్రణాళికలు రూపొందించి, రైతు సాధికార సంస్థ ద్వారా హార్వెస్టర్లు, ఇతర యంత్ర పరికరాలు అందించాలని తెలిపారు.

## ఆక్వా రైతులకు భారీ ఊరట

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్లూ ఎకానమీ దిశగా అడుగులు వేస్తూ ఆక్వా రైతులకు భారీ ఊరట కల్పించారు. కొత్త ఆక్వా కనెక్షన్లకు కూడా విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించారు. ప్రస్తుతం యూనిట్‌కు రూ.1.50 చొప్పున ఇస్తున్న విద్యుత్ సబ్సిడీని కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న 12,680 ఆక్వా కనెక్షన్లకు కూడా వర్తింపజేయాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే 50 వేల కనెక్షన్లకు ప్రభుత్వం ఏటా రూ.1,100 కోట్ల సబ్సిడీ భరిస్తోందని, తాజా నిర్ణయంతో మరో రూ.188 కోట్ల అదనపు భారం పడుతుందని వివరించారు. రాష్ట్రంలో ఆక్వా సాగవుతున్న 4 లక్షల ఎకరాలనూ ఆక్వా జోన్ పరిధిలోకి తేవాలని లక్ష్యంగా నిర్దేశించారు.

ఆక్వా రంగాన్ని 'బ్లూ ఎకానమీ'గా అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. నాణ్యత ధృవీకరణ, ట్రేసబిలిటీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. సముద్ర తీర ప్రాంత మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు రూ.240 కోట్ల వ్యయంతో 200 అత్యాధునిక మెకనైజ్డ్ బోట్లను కొనుగోలు చేసేందుకు ఆమోదం తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహించి స్థానిక మత్స్యకారుల ఆదాయం పెంచాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 90 నియోజకవర్గాల్లో ఆధునిక రైతు బజార్లను ఏర్పాటు చేసి, 'డిజి రైతు బజార్' యాప్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

**మొదటిపేజీ తరువాయి**

రాజమండ్రి రూరల్ మండలం, రాజవోలు గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి అక్కడ జరుగుతున్న పన్నుల వసూలు విధానాన్ని పరిశీలించారు. పన్నులను ఆన్లైన్లో కడుతున్న వారితో మాట్లాడారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. "కటమి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీతనంతో పని చేస్తుంది. ప్రజల నుంచి వసూలు చేసే ప్రతి పైసాను పారదర్శకంగా ఖర్చు చేస్తుంది. పంచాయతీలు స్వావలంబన సాధించాలంటే, ఆర్థికంగా వృద్ధి చెందాలి. స్వయంగా ఆదాయం ఆర్జించే స్థాయికి పంచాయతీలు రావాలి. ప్రతి అభివృద్ధి పనికి ప్రభుత్వం మీద ఆధారపడకుండా సొంతంగా అభివృద్ధి చేసుకునే దశకు పంచాయతీలు రావాలి. దీనికోసం ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహిస్తోంది. నూతన విధానాలను పంచాయతీలు కడా అందిపుచ్చుకొని, పన్నులు గ్రామ ప్రగతికి పునాదులు అనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలి" అన్నారు. పవన్ కళ్యాణ్ గారి వెంట మంత్రులు నాదెండ్ల మనోహర్ , కందుల దుర్గేష్ , రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి , ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే , పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ ఉన్నారు.



**ఆవ ఛానెల్ పరిశీలన**

రాజవోలు గ్రామపంచాయతీ నుంచి తిరిగి వస్తూ పవన్ కళ్యాణ్ రాజమండ్రిలో కీలకమైన ఆవాఎల్ చానల్ ను పరిశీలించారు. ఎస్టీపీ నుంచి వచ్చే ఈ ఛానెల్ పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయి ఉండటంపై పవన్ కళ్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ మతి కీర్తి చేకరి, జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్ లను పిలిచి కాలువలో వ్యర్థాలు పేరుకుపోకుండా, ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు నిలిచిపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీల్లో స్వచ్ఛరథాలు మాదిరిగా అర్బన్ ప్రాంతాల్లో కడా ప్రత్యేకంగా ఏదైనా కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఎందుకు పేరుకు పోతున్నాయనే విషయం మీదా, ఆ సమస్య మీద ప్రజల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. దీనికి ప్రభుత్వం నుంచి తగిన సహకారం అందుతుందని, వెంటనే ఛానల్ సరిదిద్దే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

**- గోదావరి పరీవాహకంలో కాలుష్య నివారణకు రూ.100 కోట్లు**

కృష్ణా, గోదావరి నదులను కాలుష్యం నుంచి రక్షించడానికి, వాటిని శుభ్రపరచడానికి మిషన్ క్లీన్ కృష్ణా, గోదావరి ప్రాజెక్టులు చేపట్టారు. అయితే అనుకున్నంత స్థాయిలో ఫలితాలు ఇవ్వలేదని గుర్తించారు. గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో నదీ జలాలు కాలుష్యం బారిన పడకుండా రూ.100 కోట్లను కేటాయిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఈ నిధుల ద్వారా మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు నేరుగా కాలువల్లో కలకవకుండా నిరోధించడానికి ఉపయోగిస్తామని పవన్ కళ్యాణ్ తెలిపారు. నది, కాలువల్లోకి వెళ్లే మురికినీటిని శుద్ధి చేయడానికి ఎస్టీపీలను ఏర్పాటు చేయడం వంటి పనులను ఈ నిధులతో చేపట్టాలని నిర్ణయించారు.

**వుడ్ బ్యాంక్ కోసం పంచాయతీరాజ్ - అటవీ శాఖ మధ్య అవగాహన ఒప్పందం**

వుడ్ బ్యాంక్ కింద మొక్కలు కొనుగోలు చేయడానికి పంచాయతీరాజ్ - అటవీ శాఖల అవగాహన ఒప్పందం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.10 కోట్లను పంచాయతీరాజ్ శాఖ వారు అటవీ శాఖకు ఇస్తారు. అందుకు సంబంధించి అటవీ శాఖ కలపను త్వరగా ఇచ్చే మొక్కలను అందిస్తుంది. వాటితో పంచాయితీల్లో పల్లె వనాలు అభివృద్ధి చేస్తారు. అక్కడ వచ్చే కలపను అటవీ శాఖ కొనుగోలు చేసి వుడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తుంది. ఈ కార్యక్రమం ద్వారా అటు పంచాయతీలకు ఆదాయ ఆర్జన సాధ్యమవుతుంది, ఇటు పర్యావరణం మెరుగవుతుంది. ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై పీసీసీఎఫ్ చలపతి రావు, పి ఆర్ ఆర్డీ కమిషనర్ కృష్ణ తేజ సంతకాలు చేశారు.

## పంచాయతీ సిబ్బందికి రేవంత్ సర్కారు తీపి కబురు

**మొదటిపేజీ తరువాయి**


ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.50 కోట్లను ప్రత్యేకంగా విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కేవలం పంచాయతీ సిబ్బందికే కాకుండా, ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ నెల మొదటి రోజే జీతాలు అందేలా చూడాలని తేల్చిచెప్పారు. సిబ్బంది జీతాల చెల్లింపులో ఒక్కరోజు ఆలస్యమైనా సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో జమ చేయాలన్న నిబంధనను రద్దు చేయాలని ఆదేశించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 70(3)కి సవరణలు చేసి, పంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీకి బదులుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది పంచాయతీల ఆర్థిక స్వేచ్ఛను పునరుద్ధరించడానికి దోహదపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు.

పెన్షన్ల పంపిణీ విధానంలోనూ మార్పులు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పెన్షన్లను ఇకపై నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని చెప్పారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, అనర్హులను ఏరివేయడం సులభమవుతుందని తెలిపారు. ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్, సామాజిక-ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ) డేటాను ఉపయోగించి పెన్షన్ల క్రమబద్ధీకరణ చేపట్టాలన్నారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేటినుంచి టిడిపి మహానాడు

**మొదటిపేజీ తరువాయి**

సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహానాడు నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశర చేశారు. తెలుగువారు ఆసక్తిగా ఎదురు చూసే కార్యక్రమం మహానాడు అని, పార్టీకి అది ఒక భావోద్వేగమని సీఎం చంద్రబాబు అన్నారు. మహానాడు ద్వారా పార్టీ ప్రజలకు ఏ సందేశం ఇస్తుందో
అన్న ఆసక్తి అందరిలో ఉంటుందని చెప్పారు. గతంలో కోవిడ్ సమయంలో కూడా డిజిటల్ పద్ధతిలో మహానాడు నిర్వహించామని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరోసారి వర్చువల్ విధానాన్నే ఎంచుకున్నామని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున వర్చువల్ రూపంలో మహానాడు నిర్వహించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1845 క్లస్టర్ల పరిధిలో మహానాడు నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్టీ ఎదుగుదలకు, కార్యకర్తలు నాయకులుగా ఎదగడానికి క్లస్టర్ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. ఈసారి 'స్త్రీశక్తి' థీమ్‌తో మహానాడు నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. క్లస్టర్ల వారీగా క్షేత్రస్థాయిలో జరిగే మహానాడులో రాష్ట్రస్థాయి నాయకులు కూడా పాల్గొంటారని సీఎం చంద్రబాబు తెలిపారు. మహానాడులో సరైన మార్గనిర్దేశర చేసుకుని వాటిని అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరిలో జవాబుదారీతనం ఉండాలని.. అప్పుడే ప్రజలు విశ్వసిస్తారని అన్నారు. పార్టీ కార్యకర్తలు అన్ని విధాలా సాధికారత సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించడంతో పాటు రాష్ట్రాభివృద్ధికి పునరంకితమయ్యేలా మహానాడును నిర్వహించుకుందామని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.



# ఈడీ విచారణకు
## చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి భార్య, కుమారుడు

**లిక్కర్ స్కామ్ లో విచారణ వేగవంతం చేసిన ఈడీ**

**ఈడీ అధికారులకు తమ ఆస్తుల వివరాలను అందించామన్న మోహిత్ రెడ్డి**

**తమ కుటుంబం సంపాదించిన ప్రతి రూపాయి కష్టార్జితమేనని వ్యాఖ్య**

**అమరావతిమే 26(రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన విచారణను మరింత వేగవంతం చేసింది. ఈ వ్యవహారంలో జరిగిన మనీలాండరింగ్ ఆరోపణలపై దృష్టి సారించిన ఈడీ... వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసుల మేరకు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి భార్యతో పాటు ఆయన కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఈరోజు ఈడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం మోహిత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... ఈడీ అధికారులు అడిగిన తమ ఆస్తుల వివరాలన్నింటినీ పూర్తిస్థాయిలో అందజేశామని, దర్యాప్తుకు తమ వంతుగా పూర్తిగా సహకరిస్తున్నామని తెలిపారు. తమ కుటుంబం సంపాదించిన ప్రతి రూపాయీ కష్టార్జితమే తప్ప... అందులో ఎలాంటి అక్రమ సంపాదన లేదని స్పష్టం చేశారు. ఏపీ సిట్ కేవలం కక్షపూరితంగానే తమపై కేసులు నమోదు చేసిందని ఆయన ఆరోపించారు. ముడుపుల సొమ్ముతో తాము ఆస్తులు కొనుగోలు చేశామనే ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని, ఈ కేసులను న్యాయపరంగానే ఎదుర్కొంటామని చెప్పారు. తాము సంపాదించిన ప్రతి పైసా సక్రమమైనదేనని పేర్కొన్నారు.

# శివరాజ్ సింగ్ చౌహాన్ మోదీపై పుస్తకం..
## ప్రధాని మోదీతో తన అనుభవాలపై 'అప్నాపన్' పేరుతో రచన





**ఢిల్లీ మే 26(రిపబ్లిక్ న్యూస్):**
కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీతో తనకున్న వ్యక్తిగత అనుబంధం, అనుభవాల గురించి వివరిస్తూ చౌహాన్ 'అప్నాపన్: మై ఎక్స్‌పీరియన్సెస్ విత్ నరేంద్ర మోదీ' పేరుతో ఈ పుస్తకాన్ని రాశారు. ఢిల్లీలోని పూసాలో ఉన్న ఐకార్ క్యాంపస్‌లో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ పుస్తకాన్ని మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈ వేడుకలో ఏపీ మంత్రి నారా లోకేష్ పాల్గొని పలువురు జాతీయ స్థాయి నేతలను కలిశారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు, బీజేపీ సీనియర్ నేతలు, సాహితీవేత్తలు హాజరయ్యారు. ప్రధాని మోదీ నాయకత్వ లక్షణాలు, ఆయన వ్యక్తిత్వం, ప్రజలతో మమేకమయ్యే తీరును ఈ పుస్తకం చక్కగా వివరిస్తుందని వక్తలు ప్రశంసించారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన టీడీపీ తరఫున లోకేష్ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

**మొదటిపేజీ తరువాయి**

అణ్వాయుధాల తయారీ సాధ్యమవుతుందని, అందుకే దీనిపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడేందుకు అవసరమైతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కూడా చెప్పారు . కాగా, తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడడం లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. శుద్ధి చేసిన యురేనియంను నిర్వీర్యం చేసేందుకు అమెరికాకు అప్పగించాలి. లేకపోతే అటామిక్ ఎనర్జీ కమిషన్ లేక దాని సమానస్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకొని.. ఒక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో దానిని నాశనం చేయాలని ట్రంప్ రాసుకొచ్చారు. తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందని ఇప్పటికే వార్తలు
వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను టా÷-గ్గ÷ట్ చేసింది. 10 కమాండ్ సెంటర్లు సహా ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు ఆ దేశ సైన్యం వెల్లడించింది.

# పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

**మేడ్చల్‌మే 26(రిపబ్లిక్ న్యూస్):**
మైనర్ బాలికపై లైంగికదాడికి సంబంధించి పోక్సో కేసు ఎదుర్కొంటున్న కేంద్రమంత్రి బండి సజంయ్ కుమారుడు బండి భగీరథ్‌ను మూడు రోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ మేడ్చల్ జిల్లా కోర్టు మంగళవారం నిర్ణయం తీసుకుంది. భగీరథ్‌ను తదుపరి విచారణ నిమిత్తం ఆరురోజులపాటు తమకు అప్పగించాలంటూ నాలుగు రోజుల క్రితం సిట్ అధికారులు కోర్టులో ఫిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. సిట్ పిటిషన్‌పై విచారించిన కోర్టు బుధవారం నుంచి పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. బుధవారం ఉదయం ఆయన్ను చర్లపల్లి జైలు నుంచి సిట్ కార్యాలయానికి తరలించనున్నారు. కూకట్‌పల్లిలోని సిట్ కార్యాలయంలో రీతూరాజ్ నేతృత్వంలో దర్యాప్తు బృందం విచారించనుంది. ఇప్పటికే అసవరమైన ప్రశ్నావళిని సిట్ బృందం రూపొందించింది. మైనర్ బాలికపై లైంగికదాడితోపాటు వారి మధ్య జరిగిన ఫోన్ చాటింగులను భగీరథ్ డిలీట్ చేయడం, బాలికకు రూ. 50వేలు ఇచ్చాను అని ఆయన చేసిన ప్రకటనపై సిట్ మరింత లోతుగా విచారించనున్నట్టు తెలిసింది. లైంగికదాడి ఆరునెలల క్రితం జరిగినట్టు భగీరథ్ పేర్కొంటున్న నేపథ్యంలో దానికి సంబంధించి ఆధారాలను సేకరించనుంది. మైనర్ బాలిక తల్లి వాగ్మూలాన్ని పూర్తిగా క్రోడికరించి, భగరీథ్ నుంచి అదనపు సమాచారాన్ని , నిజాలను వెలికి తీసేందుకు అవసరమైన కసరత్తు పూర్తి చేసింది. మొత్తం మీద సిట్ అధికారుల విచారణలో నిందితుడు ఏమేరకు అంగీకరిస్తారనే కోణంలో ఇటు రాజకీయ వర్గాలు, అటు పోలీస్‌వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఎలాంటి నిజాలు బయటకు వస్తాయో చూడాల్సిందే.

# దేవనకొండలో రైతులకు ఉద్యాన పథకాలపై అవగాహన కల్పించిన జిల్లా ఉద్యాన అధికారి రాజ కృష్ణారెడ్డి




**దేవనకొండ, మే 26( ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):-**




దేవనకొండ మండలంలోని కప్పట్రాల, కరివేముల, మాచాపురం, నెల్లిబండ గ్రామాల్లో జిల్లా ఉద్యాన అధికారి రాజ కృష్ణారెడ్డి పర్యటించి ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. రైతుల పొలాలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఫామ్‌పాండ్‌ల నిర్మాణంపై రైతులకు వివరించారు. 20×20×3 మీటర్లపరిమాణంలో ఫామ్‌పాండ్ తవ్వి 500 మైక్రాన్స్ తార్పాలిన్ షీట్ వేస్తే మొత్తం వ్యయం రూ.1,80,000 అవుతుందని, ఇందులో ప్రభుత్వం నుంచి 50 శాతం సబ్సిడీగా రూ.90 వేల వరకు అందిస్తారని తెలిపారు. మూడు సంవత్సరాలు దాటిన పండ్ల తోటలకు ప్యాక్ హౌస్ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్యాక్ హౌస్ మొత్తం వ్యయం రూ.4,60,000 కాగా, ప్రభుత్వం ద్వారా రూ.2 లక్షల సబ్సిడీ డీబీటీ ద్వారా రైతుల ఖాతాల్లో జమ అవుతుందని వివరించారు. కొత్తగా పండ్ల తోటలు ఏర్పాటు చేసుకునే రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి, వారి సూచనల మేరకు సర్టిఫైడ్ నర్సరీల నుంచే మొక్కలు కొనుగోలు చేయాలని సూచించారు. ఉల్లి పంట సాగులో సీడ్ డ్రిల్లర్ ఉపయోగిస్తే సరైన మోతాదులో విత్తనాలు పడటంతో మొలక శాతం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. ఎద్దుల ద్వారా నడిచే ఉల్లి విత్తన యంత్రం ధర రూ.25 వేలుగా ఉండగా, దీనిపై రూ.12,500 సబ్సిడీ లభిస్తుందని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి నాగ సునీల్ కుమార్, రైతు సేవా కేంద్ర సిబ్బంది నాగన్న, ఛాయా, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది రంగస్వామి మరియు రైతులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో కొనసాగుతున్న ఒత్తిడి నివారణకు పోలీసులకు యోగా, ధ్యాన శిక్షణ

**పోలీసుల మానసిక ప్రశాంతతకే 'హార్ట్‌ఫుల్‌నెస్' మెడిటేషన్**








**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 26)**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలతో, రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ ఆదేశాల మేరకు, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ పర్యవేక్షణలో పోలీసు అధికారులు, సిబ్బందికి హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల మెడిటేషన్ శిక్షణ కార్యక్రమం కొనసాగింది. జిల్లా పోలీసు కార్యాలయం పరేడ్ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది యోగా, ప్రాణాయామం, ధ్యాన సాధనలు నిర్వహించారు. హార్ట్‌ఫుల్‌నెస్ ట్రైనర్లు శ్వాసక్రియలు, ఏకాగ్రత పెంపొందించే సాధనలు, మానసిక ఒత్తిడి తగ్గించే ధ్యాన విధానాలపై ప్రత్యేక శిక్షణ అందించారు. ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత పెరిగి, విధి నిర్వహణలో మరింత సమర్థత సాధించవచ్చని పోలీసు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, పోలీసు సిబ్బంది, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

## దుర్వాసనతో ఇబ్బందులు..

## అధికారులు పరిశీలన: ఎంపీడీవో జ్యోతి



**దేవనకొండ, మే 26( ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):-**

దేవనకొండ మండలం తెర్నెకల్ గ్రామంలోని తెల్లవంక వాగులో మురుగునీరు నిలిచిపోవడంతో గ్రామంలో తీవ్ర కాలుష్య సమస్య ఏర్పడింది. వాగులో నిల్వ ఉన్న మురుగునీటి కారణంగా దుర్వాసన వ్యాపించి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యరోజురోజుకుఎక్కువవుతుండటంతో జిల్లాఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జ్యోతి ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యూఎస్,పంచాయతీరాజ్, మైనర్ ఇరిగేషన్ శాఖల అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. వాగులో పేరుకుపోయిన మురుగు నీటిని పరిశీలించి సమస్య తీవ్రతను అంచనా వేశారు. గ్రామంలోని పలుచోట్ల దుర్వాసన వ్యాపిస్తున్న పరిస్థితిని అధికారులు ప్రత్యక్షంగా గమనించారు. గ్రామస్థులు మాట్లాడుతూ, వాగులో మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులకు వివరించారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాలు కురిసే సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపించారు. వెంటనే శాశ్వత పరిష్కారం చేపట్టాలని గ్రామస్తులు అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జ్యోతి మాట్లాడుతూ, సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలు తీసుకునేలా చూస్తామని తెలిపారు. మురుగునీరు తొలగింపు, వాగు శుభ్రపరిచే పనులను త్వరలో ప్రారంభించేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తామని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పరిశీలన కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు,పంచాయతీరాజ్ సిబ్బంది, మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# దేవనకొండలో ఘనంగా "చైతన్య రథయాత్ర బడి పిలుస్తోంది" కార్యక్రమం

**దేవనకొండ, మే 26( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**

ప్రతి చిన్నారి పాఠశాలకు వెళ్లాలనే లక్ష్యంతో దేవనకొండ మండలంలో "చైతన్య రథయాత్ర బడి పిలుస్తోంది" కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 1 గంటలకు ఎంఆర్సీ దేవనకొండ కార్యాలయం వద్ద ప్రారంభమైంది. విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు కలిసి రథయాత్రను ప్రారంభించారు. రథయాత్ర ఎంఆర్సీ కార్యాలయం నుండి దేవనకొండ ప్రధాన ఎంపీపీ పాఠశాల వరకు సాగి తిరిగి ఎంఆర్సీ కార్యాలయానికి చేరుకుంది. మార్గమంతా ఉపాధ్యాయులు విద్య ప్రాముఖ్యతపై నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. "బడి పిలుస్తోంది పిల్లలను పాఠశాలకు పంపండి", "ప్రతి పిల్లవాడికి విద్య హక్కు" వంటి నినాదాలతో రథయాత్ర ఆకట్టుకుంది. గ్రామ ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి మంచి స్పందన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎస్ఎస్ఏ ఏఎంఓ శ్రీ రఫీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే ఎంఈఓ-1 ఎం. ఉస్మాన్ బాషా







గారు, ఎంఈఓ-2 విజయ నిర్మల, ఎంఆర్సీ లక్ష్మీనారాయణ స్వామి , మెసెంజర్ మాలిక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచితపాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు మరియు మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలుఅందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తును బంగారు మయం చేయాలని సూచించారు. విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దేవనకొండ మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

# నగరపాలక హెల్ప్‌లైన్‌తో వేగవంతమైన సేవలు

**-కొత్త హెల్ప్‌లైన్ నెంబర్ ప్రారంభించిన కమిషనర్ చల్లా ఓబులేసు**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 26)**

నగరపాలక సంస్థ సేవలను ప్రజలకు మరింత సులభంగా, వేగవంతంగా అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ప్రజలు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా ఉచితంగా కాల్ చేసి పలు రకాల సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్‌ను నగరపాలక కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌లో ప్రారంభించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర ప్రజలు పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాల మరమ్మత్తులు, తాగునీటి సరఫరా, రహదారుల మరమ్మత్తులు వంటి ప్రాథమిక సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలను సులభంగా తెలియజేసేందుకు ప్రత్యేక టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఫిర్యాదుల కోసం 1800 425 9766 నెంబర్‌కు కాల్ చేయవచ్చని, వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు







పంపాలనుకునే వారు 7422992299 నెంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్ గది ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ప్రజల సౌకర్యార్థం కూర్చొనే ఏర్పాట్లు, తాగునీటి సదుపాయం, ఎండ నుండి రక్షణ కోసం గ్రీన్ షెడ్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

హెల్ప్ డెస్క్‌లో పనిచేసే సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ ఆదేశించారు. కాల్స్, వాట్సాప్ సందేశాల ద్వారా వచ్చే ఫిర్యాదులను సామరస్యంగా పరిష్కరించాలని సూచించారు. సమస్య అందిన వెంటనే సంబంధిత అధికారులకు, విభాగాధిపతులకు సమాచారం అందించి త్వరితగతిన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, ఆర్వో జునైద్, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, ఎంఈ గిరిరాజ్, సూపరింటెండెంట్లు రామకృష్ణ, క్రిస్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు మాయాజాలానికి యువత దూరంగా ఉండాలి

**పొగాకు ఉత్పత్తులు ప్రాణాంతక వ్యాధులకు కారణం**

**ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమంలో వైద్య నిపుణుల హెచ్చరికలు**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 26)**

యువత పొగాకు కంపెనీలు చేస్తున్న ప్రచార మాయాజాలానికి లోనుకాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, కర్నూల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే. చిట్టి నరసమ్మ పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం (మే 31) సందర్భంగా స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌లో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు వినియోగం అంటే కేవలం సిగరెట్ తాగడమే కాదని, గుట్కా, పాన్ మసాలా, ఈ-సిగరెట్, హుక్కా, నషమ్ వంటి పదార్థాల వినియోగం కూడా క్యాన్సర్‌కు దారితీస్తుందని తెలిపారు. పొగాకు ఉత్పత్తుల వల్ల గుండెపోటు, పక్షపాతం, వంధ్యత్వం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సి.ఎస్.కే. ప్రకాష్ మాట్లాడుతూ క్యాన్సర్ అంటే కేవలం ఊపిరితిత్తుల క్యాన్సర్ మాత్రమే కాదని, ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, అన్నవాహిక, పెద్దప్రేగు,




లివర్ క్యాన్సర్ వంటి అనేక రకాల క్యాన్సర్లు పొగాకు వినియోగంతో సంభవించే అవకాశముందని వివరించారు. యువత ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

వైస్ ప్రిన్సిపల్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సింధియా శుభప్రద మాట్లాడుతూ దేశ భవిష్యత్తు అయిన యువత పొగాకు ఉత్పత్తులకు బానిస కావడం ఆందోళనకరమన్నారు. పొగాకు మత్తుకు బానిసైన వారికి ప్రభుత్వం ప్రత్యేక డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవి నాయక్ వ్యవహరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్ రూఫస్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. నాగరాజు, డా. చంద్రశేఖర్, డా. సుమన్, లెక్చరర్ సురేష్, ఎన్‌టీసీపీ సైకాలజిస్టులు చంద్రశేఖర్, సోమశేఖర్, ఎస్.ఆర్. బ్రయన్, పీజీ వైద్యులు డా. కార్తీక్, డా. సురేష్, డా. శ్రీలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్లు సాయిరాం, మాధవరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇస్కఫ్ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**శాంతి, సామాజిక చైతన్య లక్ష్యాలతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుంగ శ్రీధర్ రావు పిలుపు**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 26)**

భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) కర్నూలు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుంగ శ్రీధర్ రావు తెలిపారు. బ్రహ్మారెడ్డి హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఇస్కఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి జిల్లా అధ్యక్షులు బి. సుంకన్న అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుంగ శ్రీధర్ రావు మాట్లాడుతూ, 1941లో ఫ్రెండ్స్ ఆఫ్ సోవియట్ యూనియన్‌గా ప్రారంభమైన ఇస్కఫ్ సంఘం గత 81 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలకు వ్యతిరేకంగా, శాంతి పరిరక్షణ కోసం ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ పనిచేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇస్కఫ్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఇస్కఫ్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బి. నాగరాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్. మనోహర్



మాణిక్యం, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బి. సుంకన్న ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఏ. మాధవ శేఖర్, ఈ. నాగరాజు గౌడు, డి. గణేష్, కె.వి.ఎంసి. నాయుడు, నాగరాజు ఎన్నికయ్యారు.

జిల్లా సహాయ కార్యదర్శులుగా ఎన్. నబీ రసూల్, కొండప్ప, పి. రామకృష్ణారెడ్డి, కే. శ్రీనివాసులు, వి. నాగరాజు ఎన్నిక కాగా, జిల్లా గౌరవ అధ్యక్షులుగా జి. పుల్లయ్య, జిల్లా గౌరవ సలహాదారులుగా సి. రమేష్, జి. నాగశేషయ్య, నాగరాజు ఎన్నికైనట్లు తెలిపారు. వీరితో పాటు మరో 17 మంది జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైనట్లు వెల్లడించారు.

ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్. లెనిన్ బాబు, నగర కార్యదర్శి పి. రామకృష్ణారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. మునెప్ప, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షామీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

# రిపబ్లిక్ న్యూస్ కు స్పందన

## ధర్నాతో స్పందించిన అధికార యంత్రాంగం - మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా.

**రైల్వేకోడూరు మే 26 రిపబ్లిక్ న్యూస్.**

రైల్వే కోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు మండలం వెలగచర్ల, గ్రామంలోని గత నెల 16న ఉపాధి కూలీలు ట్రాక్టర్ బోల్తా పడడంతో ఇద్దరు మృతి, మరో 50 మంది గాయపడి, చేతులు కాళ్లు నడుము, తీవ్రంగా దెబ్బతిన్నాయని , సిఐటియు మండల కన్వీనర్ ఏ శిరీష ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేయడంతో, డిఆర్ఓ స్పందించి, అధికారులను మందలించి మంగళవారం గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకురాలు, వై సుజాత, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పంది కాళ్ళ మణి, మాట్లాడుతూ. ఈరోజు గ్రామంలోకి డ్వాక్ర పిడి , ఎండిఓ , మెడికల్ ఆఫీసర్లు,డాక్టర్లు, నర్సులు, ఆశా వర్కర్లు, మెడికల్ క్యాంపు నిర్వహించారు. అధికారులుస్పందించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ,అభినందనలు తెలిపారు. మృతుల కుటుంబాలకు, పిడి చిన్న మద్దిలేటి, రెండు లక్షల రూపాయలు




ప్రభుత్వం తరపున ఎక్స్గ్రేషియా ప్రకటించారు. తీవ్ర దెబ్బలు తగిలిన వారికి, 25000, ప్రకటించారు. త్వరలో వారి అకౌంట్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ డబ్బులు, ఏమాత్రం సరిపోవని, ముఖ్యమంత్రి స్పందించి, మృతులకు20 లక్షలు, క్షతగాత్రులకు, ఐదు లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు, సంఘటన జరిగి నెల రోజులు దాటిపోయిన , 50 మంది పైగా తీవ్రంగా దెబ్బలు తగిలి నష్టపోతే, ఎవరు పట్టించుకోలేదని, ఎర్రజెండా సిఐటియు పట్టించుకోవడం పట్ల, బాధితులు సంతోషం వ్యక్తం చేశారు.



# రెచ్చిపోతున్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ దొంగలు

## ఆందోళనలో రైతులు.

**రైల్వే కోడూరు మే 26 రిపబ్లిక్ న్యూస్.**



ఓబులవారిపల్లి మండలంలో రైతుల వ్యవసాయ పంట పొలాల్లో ట్రాన్స్ఫార్మర్ల దొంగలు రెచ్చిపోతున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారని, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను దొంగిలించిన దొంగలను పోలీసులు పట్టుకుంటారు కానీ చర్యలు ఉండవు అందుకే రోజు రోజుకి వ్యవసాయ పొలాల్లో ట్రాన్స్ఫార్మర్ల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఓబులవారిపల్లి మండల కార్యదర్శి చింతల పూరి నాగమ్మ, రైల్వే కోడూరు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య తెలిపారు, ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ ఓబులవారిపల్లి మండలంలోని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఓబులవారిపల్లి మండల కార్యదర్శి చింతలపూరి నాగమ్మ ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయ రైతుల పంట పొలాలలో ట్రాన్స్ఫార్మర్లను దొంగలించిన పొలాలను పరిశీలించడం జరిగినది,

మండలంలో ట్రాన్స్ఫార్మర్ దొంగలు రైతులకు రాత్రి సమయంలో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని అన్నారు. యాల్లయపల్లి గ్రామంలోని రైతులు గుంటుపల్లి గంగాధర్. చలమాల నరసింహులు పంట పొలాలలోని ట్రాన్స్ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో వచ్చి విద్యుత్ లైన్ తొలగించి ట్రాన్స్ఫార్మర్ ను పగలగొట్టి అందులో ఉన్న రాగి వైరు దొంగలించడం జరిగిందని అన్నారు. ఎల్లాయపల్లి పంచాయతీలో ఇప్పటికే 7 ట్రాన్స్ఫార్మర్లు దొంగలించడం జరిగినదని, మండల వ్యాప్తంగా ఇప్పటికీ 24 ట్రాన్స్ఫార్మర్లను దొంగలు దోసుకున్నా కూడా పోలీస్ అధికారులు ఇంతవరకు దొంగలను పట్టుకొవడం, దొంగలపైన చర్యలు తీసుకోవడం లేదన్నారు, అందువలన దొంగలు రోజురోజుకు రైతుల వ్యవసాయ పొలాల మీద పడి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను దొంగలించడం ఎక్కువ గా జరుగుతున్నది అన్నారు.భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పోలీసు అధికారులను ఒకటే అడుగుతున్నాం రైతుల పైన మీకు ఏ మాత్రం దయా దాక్షిణ్యం ఉంటే మీరు వెంటనే టవర్ డంపు లొకేషన్ ద్వారా దొంగలను పట్టుకొని వారిపై కేసులు కట్టి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొని దొంగలు రైతుల పొలాలలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల ద్వారా దోచుకున్న డబ్బులను రైతులకు తిరిగి కట్టించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నాం,అదేవిధంగా కొర్లకుంట సబ్ స్టేషన్ విద్యుత్ ఏఈ కిరణ్ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు పోయిన రైతులకు వెంటనే కొత్త విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు మంజూరు చేసి రైతులను వారి పంటలను ఆదుకోవాలని ఏ ఈ కిరణ్ కి తెలియజేస్తున్న



మన్నారు, నష్టపోయిన రైతుల గురించి ఓబులవారిపల్లి ఎస్ఐ, కొర్లకుంట ఏఇ వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలి అలా చేయని పక్షంలో రైతులను అందరినీ కలుపుకొని ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని పోలీస్ అధికారులకు, విద్యుత్ అధికారులకు తెలియజేస్తున్నామన్నారు,


ఈ కార్యక్రమంలో డి హెచ్ పి ఎస్ రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యదర్శి మోడీ శివయ్య నష్టపోయిన రైతులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహించాలి

## ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలి

## జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 26)**

కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి అధికారులను ఆదేశించారు.

విజయవాడ నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సంబంధించిన కార్యాచరణ, కాలపట్టిక, విధివిధానాలపై సమగ్ర సూచనలు జారీ చేశారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా అమలు చేయాలని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన ఓటరుకు ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఈఓలు, ఈఆర్ఓలు కాలానుగుణంగా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశాల ద్వారా ఎస్ఐఆర్‌కు సంబంధించిన చట్టపరమైన నిబంధనలు, విధానాలు, కాలపట్టికలు, కార్యాచరణపై రాజకీయ పార్టీలకు పూర్తి అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవగాహన సమావేశాలు నిర్వహించారని తెలిపారు. ఈ-రోల్ ఫ్రీజ్ పూర్తయిన వెంటనే ఎన్యూమరేషన్ ఫార్ముల తయారీ చేపట్టాలని, బీఎల్ఓ కిట్ల పంపిణీ సమయానికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

**స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యాచరణ షెడ్యూల్:**

జూన్ 5 నుండి జూన్ 14 వరకు ప్రిపరేషన్, ట్రైనింగ్, ప్రింటింగ్ తదితర కార్యక్రమాలు

జూన్ 15 నుండి జూలై 14 వరకు హౌస్ టు హౌస్ వెరిఫికేషన్ కార్యక్రమం

జూలై 14 పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ పూర్తి

జూలై 21 డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ ప్రచురణ

జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్ అండ్ ఆబ్జెక్షన్స్ స్వీకరణ

జూలై 21 నుండి సెప్టెంబర్ 18 వరకు క్లెయిమ్స్ అండ్ ఆబ్జెక్షన్స్ పరిష్కారం

సెప్టెంబర్ 22 తుది ఓటరు జాబితా ప్రచురణ

ప్రతి దశలో పారదర్శకత పాటిస్తూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు.

ఈ సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, జిల్లా పరిషత్ సీఈవో వెంకటరమణారెడ్డి, కర్నూలు నియోజకవర్గ ఎన్నికల అధికారి మరియు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేష్, కోడుమూరు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో చిన్న ఓబులేసు, ఆలూరు హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్డీసీ రామసుబ్బయ్య, మంత్రాలయం ఎస్డీసీ అనురాధ, ఆదోని మరియు ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్ ఆర్డీవో మధుసూదన్, ఎలక్షన్స్ సెల్ సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు

# చిన్న వయసులో పెళ్లిళ్లు చట్టరీత్యా నేరం

## - సూపర్వైజర్ రమాదేవి



**బండి ఆత్మకూరు, మే 26, (రిపబ్లిక్ న్యూస్):-** చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం చట్టరీత్యా నేరమని అలాంటి పెళ్లిళ్లు చేసిన తల్లిదండ్రులు శిక్షార్హులవుతారని ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి అన్నారు. ఒకవేళ ఎవరైనా 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహ ప్రయత్నాలు జరిపినట్లైతే 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు. మంగళవారం మండలంలోని సంత జూటూరు అంగన్వాడీ కేంద్రంలో బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కిషోర బాల బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. నేటి ఆధునిక సమాజంలో కూడా బాలికలకు కనీసం పెళ్లి ఈడు రాకముందే కొంతమంది పెద్దలు పెళ్లి చేసి వారిని అత్తవారింటికి పంపిస్తున్నారన్నారు. దీంతో బాలికలు మానసిక ఒత్తిడికి గురికావడమే కాకుండా భవిష్యత్తులో మంచి మంచి అవకాశాలను కోల్పోతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వీటితోపాటు రక్తహీనత ఏర్పడి తల్లితోపాటు పుట్టబోయే బిడ్డకు తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తి చిన్న వయసులోనే జీవితాలను కోల్పోయే దౌర్భాగ్య పరిస్థితులు కలగజేస్తున్నారని ఆమె మండిపడ్డారు. కౌమార దశలోనే గర్భధారణకు బాధ్యులైన వారు ఫోక్సో యాక్ట్ ,బాల్య వివాహ నిషేధ చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారని సూపర్వైజర్ తెలిపారు. ప్రస్తుతం బాల బాలికలు చదువుకోవడానికి అనేక అవకాశాలు ప్రభుత్వాలు కల్పించాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దుకోనే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. చదువుతోనే బాల బాలికల జీవితాలు మెరుగుపడతాయన్నారు. సమగ్ర ప్రణాళికతో సరైన నిర్ణయాలు తీసుకుంటేనే జీవితాలు ఉన్నతంగా ఉంటాయని ఆమె తెలిపారు. ఇప్పటికైనా తల్లిదండ్రులు బాల్య వివాహాలపై అవగాహన కలిగి చిన్నవయసులో పెళ్లిళ్లు చేయడం మానుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వీరమ్మ, ఆశా వర్కర్, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తు రూపకల్పనకు జనగణన ఎంతో అవసరం

## - తహసిల్దార్ పద్మావతమ్మ



**బండి ఆత్మకూరు, మే 26, (రిపబ్లిక్ న్యూస్):-** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 2027 భారతదేశ జనాభా గనన లో ప్రతి ఒక్కరు నమోదు చేయించుకోవాలని తహసిల్దార్ పద్మావతమ్మ సూచించారు. ఇందులో భాగంగా ఆమె మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. ఈనెల 30వ తారీకు వరకు జనాభా గణన ప్రక్రియ కొనసాగుతుందని ఆమె తెలిపారు. అయితే ఇప్పటివరకు జనగణనలో నమోదు కాకుండా ఎవరైనా మిగిలి ఉంటే తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని తహసిల్దార్ విన్నవించారు. జనగణన దేశ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు మరియు భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు ఎంతో ముఖ్యమైనదని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తమ వివరాలను సమగ్రంగా అందించి జనగణన సిబ్బందికి సహకారం అందించాలని ఆమె కోరారు. ఒకవేళ జన గణన సిబ్బంది మీ ఇంటికి రాకపోతే 1855 టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ ను సంప్రదించి మీ వివరాలను నమోదు చేసుకోవాలని ఆమె కోరారుఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ విన్నవించారు.

# వర్చువల్ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

## ముక్కా రూపానంద రెడ్డి.



**రైల్వే కోడూరు మే 26 రిపబ్లిక్ న్యూస్.**

ఈనెల 27,28 వ తేదీలలో జరగనున్న వర్చువల్ మహానాడు కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ క్లస్టర్లకు, సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు విజయవంతం చేయాలని ముక్కా రూపానందరెడ్డి పిలుపునిచ్చారు. అంతేకాకుండా రెండు రోజులు పాటు ఎంతో ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఈ వర్చువల్ మహానాడు కార్యక్రమాన్ని అందరినీ సమన్వయ పరుస్తూ మన నియోజకవర్గంలోని 11 క్లస్టర్స్ పరిధిలో ఉండే నాయకులు పార్టీ కార్యకర్తలు వారి వారి క్లస్టర్ పరిధిలోని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.కావున టీడీపి పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరు వారి వారి పరిధిలో హాజరై తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మాకంగా నిర్వహించే ఈ వర్చువల్ వేడుకలని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నానని రూపానందరెడ్డి అన్నారు,రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఎలక్ట్రానిక్ మీడియా వారికి మరియు ప్రింట్ మీడియా వారికి మహానాడు కార్యక్రమం తరుపున ఆహ్వానం పలుకుతున్నాను అన్నారు.

# జనగణన త్వరితగతిన చేపట్టాలి




**చౌడేపల్లి ప్రతినిధి మే 26 రిపబ్లిక్ న్యూస్** జనగణన పొలిటిగతన చేపట్టాలని తహసీల్దార్ పార్వతి అన్నారు మంగళవారం ఈ మేరకు నివాసం లేని గృహాలను ఆమె తనిఖీ చేశారు. ఆయా గృహాలలో దుకాణాలలో ప్రజలు నివసించలేదని ఆమె అన్నారు ప్రభుత్వ నిందిత సమయంలో జనగణన పూర్తి చేసి లక్ష్యాలను అధిగమించాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ భరత్, సర్వేయర్లు మురళి, సురేందర్ రెడ్డి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్త చట్టం ద్వారా ఉపాధి కూలీల నోట్లో మట్టి కొడుతున్న కేంద్ర ప్రభుత్వం

## కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు 100 రూపాయలు నుండి 200 రూపాయలు మాత్రమే కూలీ

**కర్నూలు ప్రతినిధి, మే 26(రిపబ్లిక్ న్యూస్)**

కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ నుండి పేదలను దూరం చేసేందుకు జి రామ్ జి చట్టాన్ని తెచ్చి ఉపాధి కూలీల నోట్లో మట్టి కొట్టడానికి ప్రయత్నం చేస్తున్నదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేసే ప్రాంతానికి ఆవుల శేఖర్ తో పాటు కర్నూల్ రూరల్ మండలం ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్య సంఘం కార్యదర్శి బత్తిని సురేంద్ర యాదవ్ లు వెళ్లి అక్కడ కూలీల దగ్గరికి వెళ్లి వారి కష్టాలు అడిగి తెలుసుకోవడం జరిగిందని తెలిపారు. గార్గేయపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు 100 నుండి 150 రూపాయలు మాత్రమే కూలీ పడుతున్నదని, కొలతల ప్రకారం పనిచేసినప్పటికీ కష్టానికి తగ్గ కూలి రావడంలేదని తమతో కూలీలు



ఆవేదన చెందినట్లు తెలియజేశారు. ఉపాధి హామీ చట్టం వచ్చినప్పటినుండి గార్గేయపురం గ్రామంలో గడ్డపారలు,మెడికల్ కిట్లు, గుడారాలు, మజ్జిగ, త్రాగునీరు ఎటువంటి సౌకర్యాలు లేకుండా చేశారని వారు తెలిపారు. ఉపాధి కూలీలు పనిచేసే ప్రాంతాల్లో మెడికల్ కిట్లు, గుడారాలు,మజ్జిగ త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, సమ్మర్ అలవెన్స్ పునరుద్ధరణ చేయాలని, రోజు కూలి 700 రూపాయలు ఇచ్చి, 200 పని దినాలు కల్పించాలని, వలసలు ఆపాలని, గడ్డపారలు,పనిముట్లు ఇవ్వాలని, కొత్త చట్టం వి బి జి రామ్ జి చట్టం రద్దు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనునిత్యం పోరాటాలు చేస్తున్నదని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని కాపాడుకోవడం కోసం కూలీలు అందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా లో ఉపాధి హామీ కూలీలకు 307/- రూపాయలు ఎక్కడ చెల్లించడం లేదని, 100 రూపాయల నుండి 200 రూపాయల లోపు మాత్రమే తక్కువ కూలి చెల్లించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారన్నారు . తక్కువ కూలి ఇస్తున్నందున అన్ని గ్రామాల్లో ఉపాధి కూలీల హాజరు కూడా అంతంత మాత్రమే ఉన్నదని అన్నారు. ఉపాధి కూలీల సమస్యలపై జిల్లా కలెక్టర్ మరియు డ్వామా పి డి ల దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు

# కార్డుదారులకు నాణ్యమైన రేషన్ సరుకులే లక్ష్యం

## అక్రమాలపై కఠిన చర్యలు -వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే సరఫరా





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 26)**

జిల్లాలోని చౌక ధరల దుకాణాల ద్వారా కార్డుదారులందరికీ నాణ్యమైన రేషన్ సరుకులు సమయానికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశంలో రేషన్ పంపిణీ, ఈ-పోస్ యంత్రాల పనితీరు, అక్రమ రవాణా నివారణ, దీపం పథకం అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్డుదారులకు నాణ్యమైన సరుకులు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. సరుకుల పంపిణీలో ఎవరైనా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 10 లేదా 12వ తేదీలోపు రేషన్ పంపిణీ పూర్తి చేసేలా పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు.

ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధులకు ప్రతి నెల 25వ తేదీ నుంచి ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఎఫ్‌పి షాపులపై చర్యలు తీసుకున్నా ప్రజలకు ఇబ్బంది కలగకుండా సమీప దుకాణాలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నామని చెప్పారు.

దీపం పథకం కింద గ్యాస్ సిలిండర్ల పంపిణీలో అదనపు డబ్బులు వసూలు చేయరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆదోని డివిజన్‌లో ఈ విషయంలో అధిక ఫిర్యాదులు రావడంతో తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించినట్లు వెల్లడించారు. ఇప్పటికే 14 మంది డెలివరీ సిబ్బందిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డెలివరీ బాయ్స్ ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు.

జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ రేషన్ సరుకుల అక్రమ మళ్లింపును అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోందన్నారు. ప్రతి వారం 15 నుంచి 20 కేసుల వరకు విచారణ చేపడుతున్నామని తెలిపారు. ఆదోని, పత్తికొండ ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

పౌర సరఫరాల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ కె. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టులు, రైస్ మిల్లులు, గోదాముల వద్ద ప్రత్యేక నిఘా కొనసాగించాలని సూచించారు.

సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్, కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# అందరూ ఐక్యమత్యంగా ఉంటూ శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

## ఎటువంటి పుకార్లు, వదంతులను నమ్మవద్దు -అక్రమ రవాణాపై పోలీసుల ప్రత్యేక నిఘా

### కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 26)**

మే 28న జరగనున్న బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి మూగజీవాల అక్రమ రవాణా, చట్టవిరుద్ధ వధింపులు జరగకుండా జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మంగళవారం తెలిపారు.

కర్నూలు ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా సరిహద్దు ప్రాంతాలు, చెక్‌పోస్టులు, ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, అనుమానాస్పద వాహనాలను పూర్తిగా తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కర్నూలు నగరంలోని ఉల్చాల రోడ్డు వై జంక్షన్ వద్ద కర్నూలు డీఎస్పీ జె. బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు నాల్గవ పట్టణ సీఐ విక్రమసింహా, కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, స్పెషల్ పార్టీ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు డీఎస్పీ జె. బాబు ప్రసాద్ మాట్లాడుతూ, బక్రీద్ పండుగ సందర్భంగా ఎస్పీ ఆదేశాల మేరకు కర్నూలు నగరంలో ఆకస్మిక వాహన తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. ఎపీఎస్పీ 2వ బెటాలియన్, ఏఆర్, స్పెషల్ పార్టీ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలపై లాడ్జీలలో కూడా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రజలంతా ఐక్యమత్యంతో శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని, ఎటువంటి పుకార్లు, వదంతులను నమ్మవద్దని సూచించారు. అక్రమ రవాణాకు పాల్పడే వాహనాలను సీజ్ చేయడంతో పాటు, కేసులు నమోదు చేసి అరెస్టులు కూడా చేస్తామని హెచ్చరించారు.

ఎక్కడైనా సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అనుమానాస్పద రవాణా లేదా అక్రమ కార్యకలాపాలపై వెంటనే డయల్ 112, డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.





# గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

## ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుత్తి మే 26 రిపబ్లిక్ న్యూస్**



గుత్తి మండలం లచ్చనపల్లి గ్రామంలో 18 లక్షలతో నూతన గా నిర్మించిన సిసి రోడ్లు డ్రైనేజ్ కాలువలు ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ముందుగా టిడిపి నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి కి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే తెలియజేశారు. అనంతరం వైయస్సార్ సిపి నుంచి తెలుగుదేశం పార్టీలోనికి 20 కుటుంబాలు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో నారప రెడ్డి తో పాటు 20 కుటుంబాలు కండువా కప్పి సాధనంగా పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ సూర్య ప్రతాప్ పట్టణ మండల అధ్యక్షులు ఎంకే చౌదరి లక్ష్మీ రంగయ్య ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ శ్రీనివాసులు రమేష్ రాజా మారుతి ప్రసాద్ మాజీ సర్పంచ్ సుంకన్న మాజీ సర్పంచ్ తిరుపాల్ రామాంజనేయులు రామ్మూర్తి ఫీల్డ్ అసిస్టెంట్ నాగార్జున టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు పచ్చిరొట్ట ఎరువుల విత్తన పంపిణి

**చౌడేపల్లి ప్రతినిధి మే 26 రిపబ్లిక్ న్యూస్**

చౌడేపల్లి మండలంకు 75 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువు అయిన జనుము విత్తనాలు కేటాయించారని మండల వ్యవసాయ అధికారి మోహన్ తెలియజేశారు. అన్ని రైతు సేవా కేంద్రాలలో బుధవారం నుంచి పంపిణీ చేస్తారని తెలిపారు. 10 కేజీల బస్తా పూర్తి ధర రూ. 1540/-, సబ్సిడీ రూ. 770/- పోను రైతు రూ. 770/- చెల్లించాలని అన్నారు. జనుము విత్తనాలు కావలసిన రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్ కు లింక్ అయిన మొబైల్ ఫోన్ తీసుకొని తమ రైతు భరోసా కేంద్రంకు వెళ్లి పొందవచ్చని ఆయన తెలిపారు.

## గూడూరు మండలము జూలక్కల్ గ్రామములో

# కిషోర్ వికాసం వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమము



**గూడూరు**

మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మే1 నుంచి జూన్ 9వ తేదీ వరకు కిషోర్ బాలికల కు వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమము నిర్వహించడం జరుగుతున్నాయి అందులో భాగంగా ఈరోజు 26.05.2026తేదీన గూడూరు మండలము జూలక్కల్ గ్రామములో సూపర్వైజర్ శ్రీమతి పద్మావతి ఆధ్వర్యంలో కిషోర్ వికాసం వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమము నిర్వహించడం జరిగింది. అయితే 8వ రోజు భాగంగా శారీరక వ్యాయామం ప్రాముఖ్యత(క్రీడలు, ఆటలు మరియు యోగ పై అవగాహన కార్యక్రమము నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సోషియల్ వర్కర్ యన్ నరసింహులు మాట్లాడుతూ మానవ జీవితములోశారీరక వ్యాయామము చాలా ముఖ్యమైనది. ప్రస్తుత ఆధునిక యుగములో యాత్రిక జీవనంలోప్రతి మనిషి శారీరక శ్రమ వల్ల మానసిక వత్తిడికి గురవుతురన్నారు. అందువల్ల ప్రతిరోజు శారీరక వ్యాయామం చేయడంవల్ల మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం పొందవచ్చారన్నారు. మరియు బాల బాలికలు చదుతో పాటు ముఖ్యంగా శారీరక వ్యాయామం చేయడం వల్ల శారీరకంగా మరియు మానసికంగా దృఢంగా ఉండవచ్చురన్నారు. ఆటలు, క్రీడలు రోజు ఆడడం వల్ల ఆత్మ విశ్వాసం ము ,నాయకత్వ లక్షణాలు మరియు స్నేహం పూర్వక వాతావరణాన్ని పెంపొందించుకోవచ్చురన్నారు. కావున ప్రతి మనిషి ప్రతిరోజు రోజుకి 30 నిమిషాల పాటు శారీరక వ్యాయామం చేయడము వల్ల శారీరకంగా మరియు మానసికంగా ని దృఢంగా ఉండడమే కాకుండా అనేక రకాల వ్యాధుల నుండి మనము రక్షించబడతామన్నారు.

సూపర్వైజర్ శ్రీమతి పద్మావతి మాట్లాడుతూ కిషోర్ బాలికల అభివృద్ధికి బాల్య వివాహాలు అడ్డుకట్టగా నిలస్తున్నాయన్నారు. కిషోర్ బాలికలు ముఖ్యంగా సామాజిక అంశాల పట్ల అవగాహనతో పాటు మంచిగా చదువుకొని ఉన్నతమైన స్థాయికి ఎదగాలని తెలియజేస్తూ, ముఖ్యంగా సామాజిక అంశాల్లో బాల్య వివాహాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు బాల్య వివాహాల పట్ల సరైన అవగాహన లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులు చిన్నవయసులో చిన్న వయసులోనే తమ పిల్లలకు వివాహాలు చేస్తున్నారన్నారు. దీనివల్ల ముఖ్యంగా ఆడపిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. అమ్మాయిలకి








కచ్చితంగా 18 సం, అబ్బాయిలకు 21 సం,పూర్తయిన తర్వాతనే వివాహాలు చేయాలని లేని పక్షంలో బాల్య వివాహ నిషేధ చట్టం కింద ఒక లక్ష రూపాయలు జరిమానా మరియు రెండు సంవత్సరాల పాటు జైలు శిక్ష ఉంటుందని మరియు నాన్ బేలబుల్ అప్లికేబుల్ అవుతుంద ని ఈ సందర్భంగా తెలిపారు. కిషోర్ బాలికలు తమ వ్యక్తిగత ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత తోపాటు సమతుల్య ఆహారముతో పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు ఎందుకనగా కిషోర్ బాలికలు పెరుగుదలకు అనుగుణంగా మంచి ఆహారము తో పాటు పౌష్టికాహారాన్ని కచ్చితంగా తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించడం జరిగింది. ఎందుకనగా ఈ సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల ఆహారంలో అన్ని రకాల పోషక విలువలతో పాటు విటమిన్స్ ముఖ్యంగా రక్తహీనతను నివారించడానికి ఐరన్ ఉండే ఆహార పదార్థాలను ఎక్కువ తీసుకోవడం వలన ఈ రక్తహీనతను అధిగమించడానికి దోహదపడతాయని తెలిపారు. అనంత రం బాల్య వివాహాల నిర్మూలన పై కిశోర బాల ,బాలికలు ప్రతిజ్ఞ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో కోనేరు సంస్థ మునిస్వామి అంగన్వాడి కార్యకర్త, ఆయా పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికురాలిపై అసత్యపు ఆరోపణ చేసి పోలీసులచే థర్డ్ డిగ్రీ చేపించిన మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ని విధుల నుండి తొలగించాలి

**బహుజన్ సమాజ్ పార్టీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం డిమాండ్**





**ఆందోల్ ప్రతినిధి మే 26( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
కరీంనగర్ జిల్లా మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సువార్త గారిని విధుల నుండి తొలగించాలని బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం డిమాండ్ చేశారు. ఈ నెల 22 న కరీంనగర్ రెండో ఠాణ పోలీసులు థర్డ్ డిగ్రీ లో గాయపడిన రణవేణి లక్ష్మి ని ఈ రోజు కరీంనగర్ జిల్లా కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ మరియూ రాష్ట్ర కమిటీ నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించారు. బాధితురాలు పార్టీ నాయకులతో తన బాదను వివరిస్తూ విలపించింది . చేతులు చూపిస్తూ పోలీసులు పెట్టిన చిత్రహింసలను వివరిస్తూ ఏడ్చింది . తన కూతురు కి ఆరోగ్యం బాగాలేదని నేను మున్సిపల్ విధులుకు వెళితే అసిస్టెంట్ కమీషనర్ ఇంటిలో విధులుకు పంపితే ముట్టు బట్టలు పిండనందుకు నా పైన దొంగతనం కేసు పెట్టి పోలీసులచే కొట్టించిందని తన ఆవేదన వ్యక్తం చేసింది. మళ్లి బంగారం కారులో దొరికిందని చెప్పి పిటీషన్ వాపసు తీసుకొని కాళ్లు మొక్కించుకుందని ఏడ్చుకుంటూ చెప్పింది. ఈ సందర్భంగా బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను వ్యక్తిగత పనులకు ఇంట్లో పని చేయించుకోవడం ఏంటని ఆయన అధికారులను ప్రశ్నించారు. వెంటనే ఆమె పై చట్టపరమైన శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలి పై సమాజం లో దొంగతనం అనే ముద్ర పడిందని ఆమె ఆత్మ గౌరవం కి బంగం కలిగిందని ఆమే గౌరవం ను ఎవరు తిరిగి ఇస్తారని అయన అన్నారు . అధికారులకు ఇంత అహంకారమా అని ప్రశ్నించారు. తెలంగాణ లో ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ నడుస్తుందా ? లేక గుండా పోలీసు వ్యవస్త నడుస్తుందా ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని అన్నారు. బాదిత మహిళ పై లాఠి చార్జి చేసిన పోలీసులను సస్పెండ్ చేసిన పోలీసు కమీషనర్ కి రెండవ ఠాణ సర్కిల్ ఇన్ స్పెక్టర్ కి కృతజ్ఞతలు తెలుపుతూ శాఖ పరమైన చర్యలే కాదు బాదితురాలి నుండి పిర్యాదు తీసుకొని చట్టపరమైన క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీస్ కమీషనర్ ని కోరారు. నిరుపేద కూలీ మహిళను పొత్తి కడుపు లో తన్ని చేతుల మీద మట్టల మీద కొట్టిన పోలీసు పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అన్నారు. మున్సిపల్ అధికారిని ని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు . లక్ష్మి కి ప్రభుత్వం నుండి 10 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు . బాధితురాలి కి నష్ట పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు బీఎస్పీ ఎల్లవేళలా అండగా ఉంటుందని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాతంగి అశోక్ అన్నారు , అసిస్టెంట్ కమీషనర్ పై చట్ట పరమైన శాఖపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షులు నల్లాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాతంగి అశోక్ , జోన్ ఇంచార్జ్ కల్లెపెల్లి. రాజేందర్ , రాష్ట్ర మాజీ కార్యదర్శి దొడ్డి సమ్మయ్య, జిల్లా అధ్యక్షులు నల్లాల శినివాస్ , జిల్లా కార్యదర్శి ఏగొల్ల వెంకన్న హుజురాబాద్ అసెంబ్లీ ఇంచార్జి అంబాల ప్రభు , కప్పల రవికుమార్ , మారపెల్లి మొగిలయ్య, కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు ఇల్లెందుల మహేష్ , హుజురాబాద్ అసెంబ్లీ అధ్యక్షులు మంద సమ్మయ్య, మానకొండూర్ అసెంబ్లీ మాజీ అధ్యక్షుడు కుమ్మరి సంపత్ , కొత్తూరి అనీల్ , చొప్పదండి అసెంబ్లీ కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు

# అర్హులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల మంజూరు

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ జిల్లా ప్రతినిధి మే 26( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
జిల్లాలో అర్హులైన వారికి ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ అధికారుల ఆదేశించారు. కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ నుంచి గూగుల్ మీట్ నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు అయినా టూవీలర్, త్రీ వీలర్, సోలార్ పంప్ సెట్, వివిధ పథకాలకు నిజమైన అర్హులను గుర్తించాలన్నారు. గతంలో జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1600 మంది దరఖాస్తు చేసుకున్నారని, మెదక్ జిల్లా లక్ష్యం 247 గా ఉందని ,వారిలో అత్యంత పారదర్శకంగా రుణాలు మంజూరు చేసేలా అధికారులు ప్రత్యేక ప్రణాళికను తయారు చేసుకోవాలన్నారు. అర్హత గల నిజమైన లబ్ధిదారులకు మాత్రమే కార్పొరేషన్ సబ్సిడీ రుణాల అందించాలని అధికారులకు సూచించారు. మే 31వ తేదీ వరకు అన్ని దరఖాస్తుల స్క్రూటీని పూర్తి చేసి ఆన్లైన్ ద్వారా, ఆఫ్లైన్ ద్వారా లబ్ధిదారుల వివరాలను ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు. ఈ గూగుల్ మీట్ లో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవోలు , వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా ధాన్యం సేకరణ జరగాలి

**---జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**





**మెదక్ జిల్లా ప్రతినిధి మే 26( ప్రజా రిపబ్లిక్ న్యూస్)** వేగంగా ధాన్యం సేకరణ జరగాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. టేక్మాల్ మండలంలోని కుసంగి గ్రామంలో ఉన్న రాయల్ ఆగ్రో ఇండస్ట్రీస్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ .. ధాన్యం సేకరణ వేగంగా జరగాలని, అన్లోడింగ్ ప్రక్రియలో త్వరగా జరగాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు.రైతులు దళారులను ఆశ్రయించవద్దన్నారు. ప్రభుత్వం ధాన్యం చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మెప్మా ఆందోల్ జోగిపేట్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో**
**వయోజన విద్యా శాఖ వారి సౌజన్యం తో**

# ఉల్లాస్ నవ భారత్ సాక్షారత కార్యక్రమం





**ఆందోల్ ప్రతినిధి మే 26( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
జోగిపేటలో లో వాలంటీర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించుట జరిగినది. శిక్షణ పొందిన వాలంటీర్లు పురపాలక సంఘం లోని నిరక్ష్య రాశ్యులకు చదువు చెప్పడం జరుగుతుంది. దీనికి ఇద్దరు crp లు మౌనిక,పద్మ గార్లు అక్షర వికాసం పైన శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైస్ చైర్మన్ శ్రీ.ఆకుల సత్యనారాయణ గారు హాజరై అందోల్ జోగిపేట ను పూర్తి అక్షరాస్యత దిశగా తీసుకెళ్లాలని వాలంటీర్లకు సూచించారు. అలాగే ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రీ.వెంకట్ రెడ్డి గారు, మెప్మా TMC బిక్షపతి గౌడ్, అర్పీలు,TLF,SLF OB లు హాజరయ్యారు.

# "సమాచార హక్కు చట్టం-2005 ప్రజల ఆయుధం దాన్ని అడ్డుకునే అధికారులపై చట్టపరమైన పోరాటం కొనసాగిస్తాం"

**అనంతపురం, మే 26: రిపబ్లిక్ న్యూస్**
అనంతపురం జిల్లా వ్యాప్తంగా సమాచార హక్కు చట్టం2005 అమలులో జరుగుతున్న నిర్లక్ష్యం, ప్రజలకు సమాచారం ఇవ్వకుండా అధికారుల తీరుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, "(ఆర్టీఐ) ఫైట్ ఫర్ సోషియల్ జస్టిస్" సంస్థ జిల్లా అధ్యక్షులు ఎం ఓ మంజునాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు.
ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(a) ప్రకారం ప్రతి పౌరుడికి సమాచారాన్ని తెలుసుకునే హక్కు ఉందని, ఆ హక్కును రక్షించేందుకే సమాచార హక్కు చట్టం2005 అమలులోకి వచ్చిందన్నారు. ఈ చట్టాన్ని గ్రామ స్థాయి నుండి మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాల వరకు ప్రతి సామాన్యుడికి చేరవేయడం "(ఆర్టీఐ) ఫైట్ ఫర్ సోషియల్ జస్టిస్" సంస్థ యొక్క అంతిమ లక్ష్యమని స్పష్టం చేశారు.
సెక్షన్ 6(1) ప్రకారం భారతదేశంలోని ప్రతి పౌరుడికి ప్రభుత్వ శాఖల వద్ద సమాచారం కోరే పూర్తి హక్కు ఉందని, సెక్షన్ 6(2) ప్రకారం "మీకు ఈ సమాచారం ఎందుకు కావాలి?" అని ప్రశ్నించే అధికారం ఏ అధికారికీ లేదన్నారు. ప్రజలు అడిగే సమాచారం ప్రజల హక్కు తప్పా? అధికారుల వ్యక్తిగత ఆస్తి కాదని పేర్కొన్నారు. అలాగే సెక్షన్ 7(1) ప్రకారం 30 రోజులలోపు సమాచారం తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని,



వ్యక్తి జీవితం లేదా స్వేచ్ఛకు సంబంధించిన సమాచారం అయితే 48 గంటలలోపు ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని తెలిపారు. అయినప్పటికీ అనేక శాఖల అధికారులు కావాలనే సమాచారం ఇవ్వకుండా కాలయాపన చేయడం, ప్రజలను బెదిరించడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం చట్టవిరుద్ధమని మండిపడ్డారు. సెక్షన్ 2(ఐ)(ఱ) ప్రకారం ప్రజలకు ప్రభుత్వ రికార్డులను తనిఖీ చేసే హక్కు ఉందని, సెక్షన్ 2(ఐ)(ii) ప్రకారం ధృవీకరించిన పత్రాల ప్రతులను పొందే హక్కు ఉందన్నారు. ప్రతి పేజీని అధికారులు సంతకం చేసి ధృవీకరించి ఇవ్వాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. అలాగే సెక్షన్ 4(1)(ఏ) ప్రకారం ప్రభుత్వ శాఖలు స్వచ్ఛందంగా కీలక సమాచారాన్ని ప్రజలకు వెల్లడించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేసే అధికారులపై సెక్షన్ 20 ప్రకారం రోజుకు రూ.250 చొప్పున గరిష్టంగా రూ.25,000 వరకు జరిమానా విధించవచ్చని, అవసరమైతే శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలకు కూడా రాష్ట్ర సమాచార కమిషన్ సిఫారసు చేయగలదని హెచ్చరించారు. సమాచారం ఇవ్వని పక్షంలో ప్రజలు మొదటి అప్పీల్ చేయాలని, అక్కడ న్యాయం జరగకపోతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించి రెండో అప్పీల్ ద్వారా న్యాయం పొందాలని ప్రజలకు సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు, అధికారులు సేవకులే తప్ప చట్టాలకు అతీతులు కాదని స్పష్టం చేశారు. చివరగా ఆయన మాట్లాడుతూ
"చట్టం ఎవరికి చుట్టం కాదుఽ సమాచారం అడగడం ప్రజల హక్కు, సమాచారం ఇవ్వడం అధికారుల విధి. ప్రజల హక్కులను అడ్డుకునే వారిపై చట్టబద్ధ పోరాటం మరింత ఉధృతం చేస్తాము" అని తెలిపారు.

# శకునాలలో బడి బాట కార్యక్రమానికి అనూహ్య స్పందన

**ఉపాధ్యాయుల ఇంటింటా ప్రచారం -ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి జి ఓంకార్ యాదవ్**

**ఓర్వకల్లు ప్రతినిధి, మే 26(రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట,బడి పిలుస్తుంది రా కార్యక్రమాల లో భాగంగా ఓర్వకల్లు మండలంలోని శకునాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు. పాఠశాలలో విద్యార్థులను చేర్పించండని ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం రోజున పాఠశాల ప్రధానోపాధ్యాయిని సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఓర్వకల్లు మండల విద్యాశాఖ అధికారి జి,ఓంకార్ యాదవ్ పాల్గొన్నారు.
విద్యార్థులు ఉపాధ్యాయులు ర్యాలీగా గ్రామంలోని కూడళ్లలో మానవహారం చేస్తూ ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించండి వారి భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దండి అంటూ నినాదాలు చేశారు. ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ జి, ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ శకునాల గ్రామ పాఠశాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో తమ తమ పిల్లలను చేర్పించాలని పిలుపునిచ్చారు. ఉన్నత పాఠశాలలో 83% ఉత్తీర్ణతతో పదవ తరగతి ఫలితాల్లో విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కార్పొరేట్ స్థాయి విద్యార్థుల మార్కులను శకునాల గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు సాధించారని గుర్తు చేశారు. 557,527, 521మార్కులతో పాటు 8 మంది విద్యార్థులు 500 మార్కులు సాధించారని పాఠశాలలోని సుమారు 70% విద్యార్థులు ఫస్ట్ క్లాస్ లో



పాస్ అయ్యారని.. లక్షలు ఖర్చు చేసి చదివించిన కూడా ఇంతకంటే మించి రిజల్ట్ తెప్పించలేరని ఒత్తిడి లేని విద్యను పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా అందిస్తున్నారని వివరించారు. 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ప్రధానోపాధ్యాయిని క మతం సునీత మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రతి సబ్జెక్టుకు ఇద్దరేసి చొప్పున ఉపాధ్యాయులు ఉన్నారని క్రమశిక్షణతో కూడిన మంచి విద్యను అందిస్తున్నందున తమ పాఠశాలకు ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధనకలిగామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించడం వలన ప్రభుత్వం తరఫున వచ్చే సంక్షేమ పథకాల వివరాలను వారికి వివరించారు. తల్లికి వందనం ద్వారా రూ. 15000,విద్యార్థులకు సమ దుస్తులు,బూట్లు, సాక్స్,లు బెల్టు,పాఠ్యపుస్తకాలతోపాటు ,నోట్ బుక్స్, నాణ్యమైన మధ్యాహ్న భోజనం తో పాటు ఐ ఎఫ్ పి ప్యానల్ ద్వారా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన, విశాలమైన క్రీడా మైదానంలో శారీరక, మానసిక దృఢత్వాన్ని కల్పించే క్రీడలు, యోగా, ప్రాణాయామం, క్రమశిక్షణ కల్పించే మాస్ డ్రిల్, గ్రంథాలయ సౌకర్యము, సైన్స్ ప్రయోగశాల వీటితో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లలకు అందించబడతాయని తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో పిల్లల చదువు కోసం ఇక పై లక్షల రూపాయలు ఖర్చు చేయడం అవసరం లేదని..చదువు కోసం ఖర్చు పెట్టే ప్రతి ఒక్క రూపాయి ఆదా చేసుకుని రేపు విద్యార్థుల భవిష్యత్తు కోసం దాచి ఉంచాలని సూచించారు. ఇంటింటా ప్రచారంపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తుల నుండి మంచి స్పందన లభించిందని ప్రధానోపాధ్యాయిని కమతం సునీత సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నాసిర్ అలీ, గజేంద్రుడు, కృష్ణప్ప, కుమారమ్మ వ్యాయామ ఉపాధ్యాయులు ఎం ఎం డి భాషా,నరసింహులు ల్యాబ్ అసిస్టెంట్ అలీశీ తదితరులు పాల్గొన్నారు.

**పొన్నకల్లు గ్రామంలో దగ్ధమైన గడ్డివాములను**

# పరిశీలించిన ఎంపీ నాగరాజు

**ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో రాజకీయ కక్షలకు పాల్పడితే సహించేది లేదు : ఎంపీ నాగరాజు**

**కర్నూలు ప్రతినిధి, మే 26(రిపబ్లిక్ న్యూస్)**
ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో రాజకీయ కక్షలకు పాల్పడితే సహించేది లేదని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మంగళవారం రోజున హెచ్చరించారు..గూడూరు మండలం పొన్నకల్లు గ్రామంలో అగ్నికి దగ్ధమైన గడ్డివాములను ఆయన పరిశీలించారు.. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.. ఈ సందర్బంగా రాజకీయ కక్షతోనే తమ గడ్డి వాములకు నిప్పు పెట్టారని బాధితులు ఎంపీ ముందు వాపోగా,



ఘటన పై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షలను,దాడులను ప్రోత్సహిచదని తెలిపారు. గడ్డివాములు దగ్ధమైన ఘటన లో ఎవరున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు..బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరుపున ఆధుకుంటామని ఎంపీ తెలిపారు.

# టిడిపి కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లు

## ఈ మహానాడు గిన్నిస్ రికార్డు ఎక్కబోతోంది

## టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ధీమా

**అమరావతి,మే 26(రిపబ్లిక్ న్యూస్):**



తెలుగుదేశం పార్టీ ఈసారి నిర్వహించే మహానాడు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో ఎక్కబోతుందని ఆంధ్రప్రదేశ్ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 1875 క్లస్టర్లలో పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే మహానాడుతో అనుసంధానం కాబోతున్నారని పేర్కొన్నారు. మంగళవారంమంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడారు. ఇప్పటివరకు 1851 క్లస్టర్లతో సాంకేతికంగా మ్యాపింగ్, అనుసంధానం పూర్తయిందని తెలిపారు. మిగతా 24 క్లస్టర్లలో నెట్ కవరేజ్ లేకపోవడంతో వారందరిని మండల కేంద్రాలకు తీసుకువచ్చి మహానాడులో పాల్గొనే విధంగా చేస్తున్నామని వివరించారు. మొత్తం 20 తీర్మానాలు రెండు రోజుల్లో పూర్తిచేస్తున్నామని పల్లా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఈ తీర్మానాలపై రెండు రోజుల్లో 65 నుంచి 80 మంది వరకు మాట్లాడుతారని చెప్పారు. మహిళలే కేంద్రంగా ఈసారి మహానాడు జరగనుందని వెల్లడించారు. రాబోయే రోజుల్లో 33 శాతం రిజర్వేషన్లు మహిళలకు వస్తాయని చెప్పారు. ఏపీలో అభివృద్ధికి, సంక్షేమానికి అడ్డుపడటం, రాజధాని అమరావతి, పోలవరంపై జగన్ అండ్ కో చేసే కుట్రలపై మాట్లాడతామని అన్నారు. వైసీపీ హయాంలో చేసిన అరాచకాలపై కూడా మహానాడులో చర్చిస్తామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ వ్యవహరిస్తున్న తీరును కూడా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపారు. మహానాడులో జగన్ అండ్ కో ప్రజా వ్యతిరేక చర్యలపై చర్చించడంతో పాటు తీర్మానం కూడా చేస్తామని వెల్లడించారు. ఈ మేరకు రాజకీయ తీర్మానం కూడా ఉంటుందని వివరించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహానాడు జరుగుతుందని చెప్పుకొచ్చారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మహానాడుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని తెలిపారు. సాంకేతికంగా కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అనుసంధానం చేశామని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# ఒడిషాలో విషాదకర ఘటన

## సెప్టిక్ ట్యాంక్ కూలి ఆరుగురు కూలీల మృతి




**భువనేశ్వర్,మే 26(రిపబ్లిక్ న్యూస్):**

ఒడిశాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కళహండి జిల్లాలో నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగిన ఆరుగురు వ్యక్తులు మృతి చెందారు. ఊపిరాడకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కళహండి జిల్లాలోని గౌద కర్లాంకుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో సెంట్రింగ్ తీయడానికి మేస్త్రి దిగాడు. సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగి సెంట్రింగ్ తీస్తున్న సమయంలో అది కూలిపోయింది. దీంతో మేస్త్రి అందులో చిక్కుకుపోయాడు. మేస్త్రిని కాపాడేందుకు మరో ఐదుగురు సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగారు. లోపలికి దిగిన ఆ ఐదుగురు కూడా ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. గ్రామస్థులు వెంటనే స్పందించి మొత్తం ఆరుగురిని వెలికి తీశారు. హాస్పిటల్‌కు తరలించారు. హాస్పిటల్‌కు తరలించే సమయానికే వారు ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. చనిపోయిన వారిలో ముగ్గురు మేస్త్రిలు, ఒక కార్మికుడు, ఇంటి యజమాని, అతడి కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు.

# మరోమారు పెరోల్‌పై డేరాబాబా

## 9 ఏళ్లలో 16 సార్లు పెరోల్ పొందిన గుర్మీత్



**న్యూఢిల్లీ,మే 26(రిపబ్లిక్ న్యూస్):**

అత్యాచార కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ అలియాస్ డేరా బాబా మరోసారి 30 రోజుల పెరోల్‌పై విడుదలయ్యారు. హరియాణాలోని సునారియా జైలు నుంచి మంగళవారం బయటకు వచ్చారు. 2017లో శిక్ష పడిన తర్వాత ఆయనకు 16వసారి పెరోల్ లభించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తన శిష్యురాళ్లు ఇద్దరిపై అత్యాచారానికి ఒడిగట్టిన నేరానికి 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ మరోసారి పెరోల్‌పై విడుదలయ్యారు. 2017లో అతడికి శిక్ష పడిన నాటినుంచి పెరోల్‌పై తాత్కాలికంగా విడుదలవడం ఇది 16వ సారి. శిక్ష అనుభవిస్తున్న గత 9 ఏళ్లలో 400 రోజులకు పైగా అతడు జైలు బయటే గడిపాడు. ప్రస్తుత పెరోల్ కాలంలో డేరా బాబా సిర్సాలోని డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయంలోనే ఉంటారని న్యాయవాది జితేందర్ ఖురానా తెలిపారు. 2002లో ఒక జర్నలిస్టు హత్య కేసులో ప్రత్యేక సీబీఐ కోర్టు డేరా బాబాకు యావజ్జీవ కారాగార శిక్ష విధించగా.. ఏడేళ్ల జైలు జీవితం తర్వాత నిర్దోషిగా విడుదలయ్యారు. ఆ తర్వాత, తన శిష్యురాళ్లపై లైంగిక వేధింపుల కేసులో 2017లో గుర్మీత్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష విధించారు. నాటినుంచి జైల్లోనే ఉంటున్నాడు. 2020 నుంచి ఇప్పటివరకు వివిధ కారణాలతో 16 సార్లు పెరోల్‌పై విడుదలై.. రోజులతరబడి బయటే తిరుగుతున్నారు. ఇప్పటికి గుర్మీత్ శిక్ష ప్రారంభమై 9 ఏళ్లు అవుతోంది. ఈ 9 ఏళ్ల కాలంలో ఆయన 400 రోజులకు పైగా జైలు బయటే గడిపారు. ప్రస్తుత పెరోల్ కాలంలో గుర్మీత్.. సిర్సాలోని డేరా సచ్చా సౌదా ప్రధాన కేంద్రంలో ఉండనున్నారు. అధికారులు కఠిన నిఘా మధ్య ఆయనను అక్కడికి తరలించినట్లు సమాచారం. గతంలో ఎన్నికల సమయాల్లో కూడా రామ్ రహీమ్‌కు పెరోల్ మంజూరు కావడం వివాదాస్పదమైంది. ప్రతిపక్ష పార్టీలు దీనిపై పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేశాయి. రామ్ రహీమ్ విడుదలయ్యే ప్రతిసారీ ఆయన అనుచరులు పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈసారి కూడా హరియాణా పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు.

# చాపకింద నీరులా ఎబోలా వ్యాప్తి !

**మే 26(రిపబ్లిక్ న్యూస్):**




ఎబోలా వణికిస్తోంది. కరోనా అంత వేగంగా కాకపోయినా మెల్లగా చాపకింద నీరులా విస్తరిస్తోంది. దీంతో ఇప్పుడు ప్రపంచ దేశాలకు కొత్త తలనొప్పి ప్రారంభం అయ్యింది. ఆఫ్రికా దేశాల నుంచి ఇతర దేశాలకు విస్తరించకుండా కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటికే ప్రపంచ దేశాలు అప్రమత్తం అయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అన్ని దేశాలకు హెచ్చరికలు జారీచేసింది. కేవలం వారాల వ్యవధిలోనే మూడు దేశాలకు పాకిన ఎబోలా వందల మందికి సోకింది. భౌగోళికంగా కూడా ఈ వ్యాధి వ్యాపించిన ప్రదేశంలో కట్టడి చేయడం చాలా కష్టమని అంతర్జాతీయ ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనుషులకు సోకే నాలుగు రకాల ఎబోలా వైరస్‌ల్లో బుండిబుగ్యో ఒకటి. దీనిని ఉగాండాలోని ఓ పర్వత ప్రాంతంలో తొలిసారి కనుగొన్నారు. గతంలో రెండుసార్లు మాత్రమే వ్యాపించడంతో అధికారులు పెద్దగా దృష్టిపెట్టలేదు. ఫలితంగా తాజాగా వ్యాపించిన ప్రదేశంలోని ల్యాబ్ పరీక్షల్లో దీనిని గుర్తించే సౌకర్యం లేకపోవడంతో.. గుర్తించేందుకు జాప్యం జరిగింది. మొదటి దీనిని గుర్తించేందుకు నమూనాను వేల మైళ్ల దూరంలో ఉన్న గవర్నమెంట్ రీసెర్చి ల్యాబ్‌కు పంపాల్సి వచ్చింది. ఈశాన్య కాంగోలోని యుద్ధ ప్రభావిత ప్రాంతమైన ఉగాండా సరిహద్దుల్లో తొలి ఎబోలా కేసు నమోదైంది. అక్కడ ఒక హెల్త్ వర్కర్ వాంతులు, జ్వరంతో చికిత్స తీసుకొని కొన్ని రోజుల్లోనే మరణించారు. ఆ తర్వాత ఆ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఇంటికి తరలించారు. దానిని తాకిన చాలా మందికి కొన్నాళ్లకే ఎబోలా లక్షణాలు బయటపడ్డాయి. వైరస్ సోకిన వారికి కొన్ని వారాలపాటు వ్యాధి లక్షణాలు బయటపడకపోవడంతో ఎక్కువ మందికి సోకే అవకాశం కలుగుతోంది. వ్యాధి వ్యాపించిన ప్రదేశం కాంగోలో ప్రధాన మైనింగ్ కేంద్రం కావడంతో జనాభా రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో 2018లో ఎబోలా వ్యాపించిన సమయంలో దానిని కట్టడి చేయడానికి ఏకంగా రెండేళ్ల సమయం పట్టింది. ఎబోలాలో జైర్ అనే స్ట్రెయిన్ అత్యంత వేగంగా వ్యాపిస్తుంది. దీంతో పోలిస్తే బుండిబుగ్యో ఎబోలా వైరస్ కొంచెం నెమ్మదిగానే తన సంఖ్యను పెంచుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. పశ్చిమాఫ్రికా ప్రాంతంలో 2014లో 11,300 మంది ప్రాణాలు తీసింది జైర్ వేరియంట్. ఇది చరిత్రలోనే అతిపెద్ద ఎబోలా వ్యాప్తి. దీంతో పోలిస్తే బుండిబుగ్యో వేరియంట్ సోకిన వారిలో 30? మంది మాత్రమే ప్రాణాలు కోల్పోయారు. కాకపోతే దీనికి ఇప్పటి వరకు ఎలాంటి వ్యాక్సిన్, చికిత్స లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. ఈశాన్య కాంగోలోని ఇటూరి ప్రావిన్స్‌లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. రోజు రోజుకూ మృతులసంఖ్య పెరుగుతుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ బుండిబుగ్యో ఎబోలాను అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమ్జర్గ÷న్సీగా ప్రకటించింది. ప్రస్తుతం కాంగో, ఉగాండ, దక్షిణ సూడాన్‌లలో వ్యాప్తి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. మరోవైపు భారత ప్రభుత్వం కూడా బుండిబుగ్యో ఎబోలాపై అప్రమత్తమైంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలకు ప్రయాణించవద్దని హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఇపపటివరకు కాంగోలో మొత్తం 867 మందికి ఈ వ్యాధి వ్యాపించగా.. 204 మరణాలు నమోదయ్యాయి. ఎబోలా ఎఫెక్ట్ భారత్‌పైనా పడింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ నెలాఖరులో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగాల్సిన నాల్గవ 'ఇండియా-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్' వాయిదా పడింది. ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాల్లో ప్రస్తుతం కలకలం రేపుతున్న ఎబోలా వైరస్ వ్యాప్తి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారత ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. మరోవైపు ముందస్తు జాగ్రత్తగా కేంద్ర ఆరోగ్య శాఖ దేశవ్యాప్తంగా అప్రమత్తత ప్రకటించింది. ముందుగా నిర్దేశిరచిన షెడ్యూల్ ప్రకారం 4వ ఇండియా-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్ మే 28 నుంచి మే 31 వరకు న్యూఢిల్లీలో జరగాల్సి ఉంది. ఈ క్లిష్ట సమయంలో ఆఫ్రికా దేశాలకు భారత్ తన పూర్తి సంఘీభావాన్ని తెలియజేసిందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. 'ఆఫ్రికా సీడీసీ' నేతృత్వంలో జరుగుతున్న ప్రజారోగ్య సన్నద్ధత, అత్యవసర పరిస్థితుల నియంత్రణ ప్రయత్నాలకు భారత్ తన వంతు సాంకేతిక, వైద్య సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేసింది. ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ అంతర్జాతీయ ప్రయాణికులకు కీలకమైన హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే వారు లేదా ఆయా దేశాల మీదుగా ప్రయాణించి భారత్‌కు వచ్చే వారు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే తమ ఆరోగ్య పరిస్థితిని అధికారులకు నివేదించాలని ఆదేశించింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ 'హై-రిస్క్'గా వర్గీకరించిన డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. ఎబోలా లక్షణాలు ఉన్నా లేదా బాధితులతో పరిచయం ఉన్నా ప్రయాణికులు స్వచ్ఛందంగా విమానాశ్రయ ఆరోగ్య అధికారులకు తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి భారతదేశంలో ఎక్కడా ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. డబ్ల్యూహెచ్ఓ సూచనల ప్రకారం ప్రభుత్వం అన్ని ముందస్తు నివారణ చర్యలను తీసుకుంటోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఎబోలా నివారణకు అవసరమైన సన్నద్ధతతో ఉండాలని కేంద్రం ఆదేశించింది. 'ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగా ఉంది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మండని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

# మహాసిమెంట్ కార్మికుల ఆందోళన


## జీతాలు పెంచాలంటూ కర్మాగారం ముందు ధర్నా



**అనకాపల్లి,మే 26(రిపబ్లిక్ న్యూస్):** ఎన్నాళ్లు చేసిన అదే కూలి ? అదే స్థాయి, తమ లాభమే కానీ కార్మికుల కష్టం పట్టదా ? అంటూ కార్మికులు నిరసన చేపట్టారు. యలమంచిలి మండలంలోని ములకలపల్లి గ్రామంలో ఉన్న మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వద్ద మంగళవారం కార్మికులంతా తమ విధులను ఆపేసి యాజమాన్యం తీరును నిరసిస్తూ మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సంస్థలో వేరు వేరు కాంట్రాక్టర్ల ద్వారా దాదాపు 500 మంది పైగా రోజు వారి కూలితో పని చేస్తున్నారని కార్మికులు తెలిపారు. తామంతా సంస్థలో చేరి ఎన్ని సంత్సరాలయినా అదే స్థితిలో ఉన్నామని, చేరినప్పుడు ఉన్న కూలీనే ఇప్పటికీ ఇస్తున్నారు తప్ప ఏమాత్రం పెంచలేదని చెప్పారు. ఇప్పటివరకు సంస్థలో స్కిల్డ్ రూ.703, సెమీ స్కిల్డ్ రూ.560, అన్ స్కిల్డ్ రూ.470 మాత్రమే ఇస్తూ ఎలాంటి వారంతాపు సెలవులు లేవు, అనారోగ్య సెలవులు లేవు, ఏరోజు వస్తే ఆరోజు మస్తరు పద్ధతిలో నడుపుతున్నారని వివరించారు. ఈ కాంట్రాక్టు కార్మికులు ఏ స్థాయిలో చేరారో, మూడు, ఐదు, ఎనిమిది ఎన్ని సంవత్సరాలు గడిచినా అదే స్థాయిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంత్సరాలుగా ఎలాంటి కూలి పెంపు లేకుండా ఇటీవల రోజుకి రూ.9 పెంచుతూ, ఇది జూన్ నెల నుంచి అమలవుతుందని యాజమాన్యం ప్రకటించిందని తెలిపారు. ఈ పద్ధతి నచ్చని కార్మికులు తమ విధులు బహిష్కరించి ఉదయం నుంచి మండుటెండలోనే నిరసనలు తెలుపుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారంతపు సెలవుతో కూడిన నెల వారి జీతం చెల్లించాలి. 2 సంవత్సరాలు దాటి పని చేస్తున్న వారిని తరువాత స్థాయికి పంపాలి. యూనియన్ ఏర్పాటుకి అవకాశం కల్పించాలని కార్మికులు కోరారు.

# ఎండల తీవ్రత మరింత పెరుగుదల

## రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు



**హైదరాబాద్,మే 26(రిపబ్లిక్ న్యూస్):** ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు ఉన్నట్టు వాతావరణశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఎండల తీవ్రత మరింతగా కొనసాగనుంది. వరుసగా రోహిణి రెండోరోజు కూడా ఎండలు మండుతున్నాయి. నిజానికి రుతుపవనాలు ఈనెల 26న కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ వాతావరణ మార్పులతో, జూన్ 5నుంచి 10 వరకు నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉన్నదని తెలిపింది. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలున్నట్టు హెచ్చరించింది. 20 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాంలో అత్యధికంగా 46.5 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా దండేపల్లిలో 46.4, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో 46.4, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 46.3, ఖమ్మం జిల్లా ఏన్కూర్‌లో 46.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని తెలిపింది. రాష్ట్రంలో మరో నాలుగురోజులపాటు తీవ్రమైన ఎండలు, వడగాలులు ఉంటాయని వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసినట్టు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ క్రమంలోనే ఆదివారం ఒక్కరోజే దాదాపు 42మంది మృతి చెందారు. ఒక్క వరంగల్‌లోనే అత్యధికంగా 20మంది మృతి చెందగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10మంది, కరీంనగర్‌లో 8 మంది, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృత్యువాతపడ్డారు. రాబోయే రోజుల్లో కూడా 43 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు హెచ్చరించారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టగా, సాయంత్రం మాత్రం అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిశాయని వివరించింది. ముఖ్యంగా నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసినట్టు తెలిపింది. కామారెడ్డి, మెదక్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వాన కురువగా, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్‌లో భారీ వర్షం కురిసినట్టు పేర్కొన్నది.

# ప్రభుత్వ సేవల్లో పారదర్శకత పెంచి ప్రజల్లో సానుకూల అభిప్రాయం తీసుకురావాలి

**ఇంటి వద్దే పెన్షన్ పంపిణీ చేయాలి.. -పర్సెప్షన్ సర్వేలో మెరుగైన ఫలితాలు సాధించాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




**నంద్యాల బ్యూరో, మే 26 (రిపబ్లిక్ న్యూస్):**
ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రజల సంతృప్తి అత్యంత కీలకమని, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజల వద్ద విశ్వాసాన్ని పెంపొందించే విధంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో పెన్షన్ పంపిణీ విధానం, ప్రజల అభిప్రాయ సేకరణ, పారదర్శక సేవల అమలుపై మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డీఎల్డీఓలు, ఎస్జీఎస్డబ్ల్యూ మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, డబ్ల్యూఎంఏ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్య నారాయణ, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లాలితాభాయి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజల్లో ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై సానుకూల అవగాహన పెంపొందించేందుకు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని మండల అధికారులను ఆదేశించారు. పెన్షన్ పంపిణీకి సంబంధించిన విధానాలపై ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జిల్లాలోని 4 వేలకుపైగా పెన్షన్ పంపిణీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వాటి ఫోటోలను రాష్ట్ర కార్యాలయానికి పంపించాలని యంపిడిఓ లను ఆదేశించారు. ప్రభుత్వ సేవలపై ప్రజల స్పందనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా పరిగణిస్తున్నదని, ఇప్పటికే 49 శాఖల పనితీరుపై పర్సెప్షన్ సర్వేలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 2 లక్షల 16 వేల మంది పెన్షన్ లబ్ధిదారులకు ప్రతి నెల రూ.98 కోట్ల మేర పెన్షన్లు అందజేస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.3500 కోట్లు ఖర్చు చేస్తున్న నేపథ్యంలో ప్రజల్లో అసంతృప్తికి తావులేకుండా సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పెన్షన్ పంపిణీపై నిర్వహించే సర్వేల్లో "ఇంటి వద్దకే పెన్షన్ అందించారా", "అధికారుల ప్రవర్తన ఎలా ఉంది?", "లంచం లేదా ఇతర డబ్బులు అడిగారా?" అనే మూడు కీలక ప్రశ్నలను అడుగుతున్నట్లు కలెక్టర్ వివరించారు. పెన్షన్లను తప్పనిసరిగా లబ్ధిదారుల ఇంటి వద్దనే, నిర్దేశిత 300 మీటర్ల పరిధిలో అందించాలని, ప్రతి పంపిణీకి జియో ట్యాగింగ్ చేయాలని స్పష్టం చేశారు. పలువురిని ఒకేచోటకు పిలిచి పంపిణీ చేయడం వల్ల ప్రజల నుంచి ప్రతికూల స్పందన వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి సోమవారం ముఖ్యమంత్రి స్థాయిలో, ప్రతి గురువారం చీఫ్ సెక్రటరీ స్థాయిలో పర్సెప్షన్ సమీక్షలు జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ప్రజల ఫీడ్‌బ్యాక్‌ను రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తోందని, థర్డ్ పార్టీ బృందాలు కూడా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల నుంచి ఎటువంటి లంచాలు ఆశించకుండా పారదర్శకంగా సేవలు అందించాలని, అన్ని ప్రశ్నల్లో 100 శాతం సానుకూల ఫలితాలు సాధించేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. పెన్షన్‌లతో పాటు చెత్త సేకరణ, తాగునీటి నాణ్యత, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై కూడా ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నట్లు తెలిపారు. వారానికి కనీసం రెండు సార్లు చెత్త సేకరణ జరుగుతోందా, తాగునీటి నాణ్యత సంతృప్తికరంగా ఉందా, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉందా? వంటి ప్రశ్నలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. "ప్రభుత్వ ఉద్యోగులమై ప్రజల కోసం పని చేస్తున్నప్పుడు ప్రజల సంతృప్తి స్థాయి తగ్గిపోతే, వ్యవస్థలో ఎక్కడో లోపం ఉన్నట్టేనని... ఆ లోపాలను సరిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం" అని6 కలెక్టర్ పేర్కొన్నారు. పర్సెప్షన్ విధానాన్ని ఒత్తిడిగా కాకుండా ప్రజా సేవలను మెరుగుపరచుకునే అవకాశంగా భావించాలని అధికారులను సూచించారు.

# ట్రాఫిక్ పోలీసులకు ఎండ తీవ్రత నుండి ఉపశమనం కొరకు వేసవి కిట్లు పంపిణీ

**జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**








**నంద్యాల క్రైం, మే 26, (రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వేసవి తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. తీవ్రమైన ఎండ వేడిమిలోనూ రోడ్లపై నిలబడి విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్య రక్షణకై రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలమేరకు నంద్యాల జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మంగళవారం నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో ట్రాఫిక్ పోలీసులకు ఎండ వేడి నుండి కాపాడుకునేందుకు అవసరమైన రక్షణ సామాగ్రిని పంపిణీ చేశారు. ట్రాఫిక్ సిబ్బందికి కింది రక్షణ వస్తువులు అందించడం జరిగింది. యూవీ ప్రొటెక్షన్ గాగుల్స్ సూర్యుని హానికరమైన అతినీలలోహిత కిరణాల నుండి కళ్ళను కాపాడేందుకు, క్యాప్స్ తల మీద నేరుగా పడే ఎండ వేడిమిని నివారించేందుకు, వాటర్ బాటిల్స్ నిరంతరం నీళ్ళు తాగుతూ డీహైడ్రేషన్‌ను అడ్డుకునేందుకు, ఫేస్ మాస్కులు వాహనాల నుండి వెలువడే ధూళి, కాలుష్యం నుండి శ్వాసవ్యవస్థను రక్షించుకునేందుకు ఎస్పీ ట్రాఫిక్ సిబ్బంది సంక్షేమం గురించి ముందుగా తెలుసుకోవడంతో పాటు, నంద్యాల పట్టణ కేంద్రంలో వివిధ ప్రధాన కూడలలో వారు చేయుచున్న విధుల గురించి ఆరా తీయడం జరిగింది. "తీవ్రమైన ఎండల్లోనూ ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అది సూచనలు సలహాలు తెలియజేయడం జరిగింది. అనంతరం వారికి వేసవి రక్షణ కిట్లను అందజేస్తూ విధుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ జావళి పాల్గొని సిబ్బందికి వస్తువులను అందజేస్తూ వారి సేవలను అభినందించారు.

# పారదర్శక సేవలతో ప్రజాభిప్రాయాన్ని మెరుగుపరచాలి

**అక్షరాస్యత లక్ష్య సాధనలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి**





**నంద్యాల బ్యూరో, మే 26(రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో ప్రజలకు అందించే సేవలలో పారదర్శకత, మర్యాదపూర్వక వ్యవహారం మరియు పనితీరు మెరుగుదలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డీఎల్డీఓలు, ఎస్జీఎస్డబ్ల్యూ మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించే ప్రతి స్థాయిలో బాధ్యతాయుత వ్యవహారం కనిపించాలని, ముఖ్యంగా స్వర్ణగ్రామ–స్వర్ణవార్డు కేంద్రాలలో సిబ్బంది పనితీరుపై ప్రజల అభిప్రాయాలను క్రమం తప్పకుండా సేకరించాలని ఆదేశించారు. కార్యాలయ సమయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండడం, ప్రజలతో మర్యాదగా ప్రవర్తించడం, అదనపు వసూళ్లకు తావులేకుండా సేవలు అందించడం వంటి అంశాలపై ప్రత్యేకంగా పర్యవేక్షణ నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా కౌశల్య పరీక్ష పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆర్టీజీఎస్ స్థాయిలో పనితీరును నేరుగా పర్యవేక్షిస్తున్నందున ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సెక్రటేరియట్ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను ఖచ్చితంగా అమలు చేయాలని, ప్రజలకు అందించే సేవలను వాట్సాప్ యాప్ ద్వారా నిర్వహించడం ద్వారా సేవలపై ప్రజల విశ్వాసం పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. గ్రామస్థాయి నుండి అన్ని ఫైళ్లను ఇ-ఆఫీస్ విధానంలోనే పంపించాలని, మాన్యువల్ విధానాలను పూర్తిగా నివారించాలని స్పష్టం చేశారు. అధికారుల పనితీరును ఒపిటిఎస్ ద్వారా అంచనా వేస్తున్నామని, హాజరు, ఇ-ఆఫీస్ వినియోగం, కర్మయోగి కోర్సులు తదితర అంశాల ఆధారంగా ర్యాంకులు నిర్ణయించబడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాను పనితీరు పరంగా అగ్రస్థానాల్లో నిలపడానికి ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజాభిప్రాయంలో చిన్న స్థాయి మెరుగుదల సాధించడమే పెద్ద సవాలుగా ఉంటుందని, అయినప్పటికీ జిల్లాను టాప్–5లో నిలబెట్టే లక్ష్యంతో అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

**జిల్లాలో అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయండి - కలెక్టర్**

ప్రస్తుతం జిల్లాలో ఇంకా 2.24 లక్షల మంది నిరక్షరాస్యులు ఉన్నారని తెలిపారు. ఈ ఏడాది 1.12 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. మే 28 నుంచి జూన్ 28 వరకు లెర్నర్స్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసి, వాలంటీర్లకు లెర్నర్లను కేటాయించాలని ఆదేశించారు. లెర్నర్ల వివరాల్లో ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, తల్లిదండ్రుల సమాచారం ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. జూలై 21 నుంచి మార్చి 15 వరకు నిర్వహించే తరగతుల్లో మొత్తం 100 గంటల బోధన, 32 ప్రాక్టీసు వర్క్‌షీట్లు, ఆడియో–విజువల్ శిక్షణ ఉండనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారిని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, డబ్ల్యూఎంఏ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యనారాయణ, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లలితాభాయి తదితరులు పాల్గొన్నారు.

# జగన్ ది ముమ్మాటికీ గొడ్డలి పార్టీనే

**ప్రధానికి కూడా లేనంతగా జగన్ తన ఇంటికి భద్రతను ఏర్పాటు చేసుకున్నారు: బీసీ జనార్ధన్ రెడ్డి**

**రాజారెడ్డికి ఉండే క్రూరత్వం జగన్ కు వచ్చిందని వ్యాఖ్య**

**జగన్ ఇంకా బెదిరించే స్వభావంతోనే మాట్లాడుతున్నారని మండిపాటు**




**నంద్యాల బ్యూరో, మే 26(రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అధికార కూటమి, వైసీపీ మధ్య ఆరోపణల పర్వం మరింత వేడెక్కింది. వైసీపీ అధినేత జగన్ రాజకీయ శైలిపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ ది ముమ్మాటికీ గొడ్డలి పార్టీనే అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలోని గ్రామాల్లో ఎన్ని రాజకీయ హత్యలు జరిగాయో తమ వద్ద పూర్తి వివరాలు ఉన్నాయని, వాటన్నింటినీ ఆధారాలతో సహా నిరూపిస్తామని మంత్రి సవాల్ విసిరారు. జగన్ హయాంలో సాగిన అరాచకాలను, ఫ్యాక్షన్ ధోరణిని భరించలేకనే రాష్ట్ర ప్రజలు గత ఎన్నికల్లో వైసీపీ 151 సీట్ల నుంచి కేవలం 11 స్థానాలకు పరిమితం చేసి గట్టి బుద్ధి చెప్పారని జనార్ధన్ రెడ్డి గుర్తుచేశారు. దేశంలో ప్రధానమంత్రికి కూడా లేని విధంగా తన చుట్టూ ఇనుప కంచెలు, అసాధారణమైన భారీ భద్రతను ఏర్పాటు చేసుకున్న జగన్... ఎంతటి తీవ్ర అభద్రతా భావంతో బతుకుతున్నారో అర్థం చేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. నాటి వైఎస్ రాజారెడ్డిలో ఉండే క్రూర స్వభావాలన్నీ ఇప్పుడు జగన్‌కు వచ్చాయని మంత్రి దుయ్యబట్టారు. 11 సీట్లకు పడిపోయినా జగన్ ఇంకా బెదిరించే స్వభావంతోనే మాట్లాడుతున్నారని, రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలను, పెట్టుబడిదారులను భయపెట్టేలా ఆయన ధోరణి ఉందని మండిపడ్డారు. దాదాపు 28 సంవత్సరాల క్రితం జరిగిన రాజారెడ్డి హత్య గురించి జగన్ ఇప్పుడు కొత్తగా మాట్లాడటాన్ని మంత్రి తప్పుపట్టారు. "గత ఐదేళ్లు మీరే అధికారంలో ఉన్నారు కదా.. మరి మీ ప్రభుత్వంలో మీ కుటుంబంలో జరిగిన హత్యలపై ఎందుకు పూర్తిస్థాయి విచారణ జరిపించి నిజాలు తేల్చలేదు?" అని జగన్‌ను నిలదీశారు. ప్రస్తుత తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం ఎంతో ప్రశాంతంగా సాగుతోందని, ప్రజల్లో శాంతిభద్రతలపై నమ్మకం పెరిగిందని స్పష్టం చేశారు. అలాగే, వాస్తవాలు రాస్తున్న పత్రికా ప్రతినిధులపై వైసీపీ శ్రేణులు దాడులకు తెగబడటం పట్ల మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సిద్దేశ్వరం అలుగు ప్రజల గుండె చప్పుడు

**-మే 31న నంద్యాలలో "సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన" 10వ వార్షికోత్సవ మహాసభ**

**-మహాసభకు హాజరుకానున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి గోపాలగౌడ తదితరులు**

**-మహాసభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చిన రాయలసీమ సాగునీటి సాధన సమితి**




**నంద్యాల మే 26( రిపబ్లిక్ న్యూస్) :**
రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు, ప్రాంత సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అనేక ఉద్యమాలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 31న నంద్యాల శివారులోని చాబోలు మెట్ట సమీపంలోని ఏ ఎస్ ఆర్ కళ్యాణ మండపంలో "సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన" 10వ వార్షికోత్సవ మహాసభ నిర్వహించనున్నట్లు సమితి నాయకులు ప్రకటించారు.
సోమవారం నంద్యాలలోని సమితి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో 2016 మే 31న జరిగిన సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన ఉద్యమానికి సంబంధించిన వీడియోను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూడ కృష్ణా, తుంగభద్ర నదులు రాయలసీమ గుండా ప్రవహిస్తూ వందలాది టీఎంసీల నీరు శ్రీశైలం దాటి దిగువకు వెళ్తున్నప్పటికీ రాయలసీమ మాత్రం ఇప్పటికీ కరువుతో సహజీవనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ సమగ్రాభివృద్ధి సిద్దేశ్వరం అలుగు నిర్మాణం ద్వారానే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాలకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పాలకులు స్పందించకపోవడంతో వేలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి 2016 మే 31న ప్రజలే స్వయంగా శంకుస్థాపన నిర్వహించారని గుర్తుచేశారు. ఆనాటి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రతి సంవత్సరం వార్షికోత్సవ సందర్భంగా పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తూ సాగునీటి సమస్యలపై ప్రభుత్వంపై ప్రజాస్వామ్య ఒత్తిడి తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ నెల 31న నిర్వహించనున్న మహాసభకు మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి గోపాలగౌడ, ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం అధ్యక్షురాలు శ్రీమతి ఝాన్సీ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు వెంకటేష్ తదితరులు విశిష్ట అతిథులుగా హాజరై తమ సందేశాలను వినిపించనున్నట్లు తెలిపారు.
రాయలసీమ సాగునీటి సమస్యలు, ప్రాంత అభివృద్ధి, ప్రజల హక్కులపై అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్యవంతం చేసే ఈ మహాసభలో ప్రజలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన అనంతరం రాయలసీమ పట్ల పాలకులు పూర్తి నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని, వారి దృష్టి అంతా అమరావతి, పోలవరం వంటి అంశాలపైనే కేంద్రీకృతమైందని విమర్శించారు. రాయలసీమ కరువు, వలసలు, సాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష పార్టీలు కూడా రాయలసీమ సమస్యల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలే చైతన్యవంతమై ప్రభుత్వాలను, రాజకీయ పార్టీలను నిలదీసి తమ హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.
రాయలసీమ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం నిరంతరం శ్రమిస్తున్న రాయలసీమ సాగునీటి సాధన సమితికి ప్రజలు అండగా నిలవాలని కోరుతూ, ఈ నెల 31న నిర్వహించే మహాసభకు ప్రజలు, రైతులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు యర్రం శంకర్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు, బెక్కం రామసుబ్బారెడ్డి, న్యాయవాది అసదుల్లా, మహేశ్వరరెడ్డి, కొమ్మా శ్రీహరి, చిన్న రామకృష్ణారెడ్డి, జానో జాగో మహబూబ్ భాష, భాస్కర్ రెడ్డి, మహమ్మద్ పర్వేజ్, పట్నం రాముడు, కృష్ణమోహన్ రెడ్డి, మనోజ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com